మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

అమరావతి | సంపుటి: 2 • సంచిక: 71 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | శుక్రవారం • 9-2-2018 | www.manamnews.com | /manamnews

సకలం బంద్

ఏపీ రాష్ట్ర బంద్ విజయవంతం.. స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు

- బస్సులన్నీ డిపోలకే పరిమితం
- విద్యాసంస్థలకు ముందే సెలవు
- పార్టీలు.. ప్రజలు అంతా రోడ్లమీదే
- 13 జిల్లాల్లో ధర్నాలు.. రాస్తారోకో
- వామపక్షాల బంద్‌కు ప్రతిపక్షాల మద్దతు
- నెల్లూరు ధర్నాలో పాల్గొన్న జగన్
- పరోక్షంగా బంద్‌లో పాల్గొన్న టీడీపీ
- ఎంపీల నిరసనకు మద్దతని వెల్లడి
- గుండు కొట్టించుకున్న టీడీపీ ఎమ్మెల్యే
- పవన్ కూడా ఆందోళన చేయాల్సిందే
- నేనూ ఆయనతో వస్తా: కత్తి మహేశ్
- హోదా ఇవ్వకుంటే చరిత్రహీనులే
- పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి





అమరావతి, ఫిబ్రవరి 8 (మనం ప్రతినిధి):

ఒక్క బస్సు చక్రం కూడా కదల్లేదు.. కాలేజీలు తెరుచుకోలేదు.. కార్యాలయాల్లో పనులు జరగలేదు.. సుదీర్ఘ కాలం తర్వాత ఆంధ్రప్రదేశ్ మొత్తం ఒక్కసారిగా స్తంభించింది. వామపక్షాలు ఇచ్చిన పిలుపునకు ప్రతిపక్షాలన్నీ మద్దతు తెలపడం, అదే సమయంలో తెలుగుదేశం పార్టీ మిగతా 5లో..



రాహుల్ నాక్కూడా బాసే

అందులో ఎలాంటి అనుమానం లేదు

- మోదీది కనిష్ఠ పాలన.. గరిష్ఠ ప్రచారం
- వ్యవస్థలన్నింటి మీద పద్ధతి ప్రకారం దాడులు
- గుజరాత్.. రాజస్థాన్‌లలో కాంగ్రెస్ పనితీరు భేష్
- 2019 ఎన్నికలకు నేతలంతా సిద్ధం కావాలి
- కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీ పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:

ఎక్కడైనా కొడుకు దగ్గర తల్లి పనిచేయడం విన్నారా? కానీ ప్రస్తుతం సరిగ్గా అలాగే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి నిన్న మొన్నటి వరకు మిగతా 5లో..



నిరసన సెగ

- పార్లమెంటులో ఏపీ ఎంపీల ఆందోళన
- కేంద్రం న్యాయం చేయాలని డిమాండ్
- వారికి టీఆర్ఎస్ ఎంపీ కవిత మద్దతు
- విభజన హామీల అమలుపై కేంద్రం 15 రోజుల్లో స్పష్టత ఇవ్వాలి: సుజనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:

విభజన చట్టం హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళన కొనసాగిస్తున్నారు. గురువారం ఉభయ సభల్లోనూ, పార్లమెంట్ మిగతా 5లో..

ఇదీలోకం!



తొందరపడి నిర్ణయం తీసుకుంటే.. పార్టీ ఆయింత ఖాళీ అవుద్దేమో సార్..!



ఏపీలో భారీ రైస్‌మిల్లు

తూ.గో.జిల్లా సామర్లకోటలో ఏర్పాటు.. సంసిద్ధత వ్యక్తం చేసిన ఫీనిక్స్ గ్రూపు

- ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు సిద్ధం
- లాజిస్టిక్స్ విధానం మాకు ప్రతికూలం
- సీఎంతో షరాఫ్ గ్రూపు ప్రతినిధుల వెల్లడి
- నిబంధనలు సడలిస్తే అమరావతికి విమానాలు
- చంద్రబాబుకు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ సూచన
- దుబాయ్‌లో చంద్రబాబు ఒకరోజు పర్యటన

దుబాయ్, ఫిబ్రవరి 8:

దుబాయ్ పర్యటనలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బిజీబిజీగా గడిపారు. ఈ నెలాఖరులో విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు వాణిజ్య-పారిశ్రామిక ప్రముఖులను ఆహ్వానించడానికి, ఆంధ్రప్రదేశ్‌కు మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు గురువారం ఒకరోజు దుబాయ్‌లో పర్యటించిన ముఖ్యమంత్రి... పలు మిగతా 5లో..

జేపీసీకి జేపీ సై



పవన్‌కు లోక్‌సత్తా అధినేత మద్దతు
జయప్రకాశ్‌తో జనసేనాని భేటీ

- మార్గనిర్దేశం చేయాలని వినతి
- తెలుగు రాష్ట్రాల కోసం కేంద్రంతో పోరు
- జేపీసీపై త్వరలో అఖిలపక్ష భేటీ: పవన్
- తెలుగు రాష్ట్రాలపై కేంద్రం శీతకన్ను
- ఏపీ విభజన హామీలు గాలికొదిలేశారు
- ఏరుదాటాక తెప్ప తగలేయడమే: జేపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (మనం ప్రతినిధి):

విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా సాధన కోసం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జేపీసీ ఏర్పాటుకు ఇచ్చిన పిలుపునకు లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు మిగతా 5లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. గాలుల తీవ్రత కొనసాగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 33 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 51 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: నవమి మ.12.16 తదుపరి దశమి; నక్షత్రం: అనురాధ సా.4.53 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా.11.11-12.58; దుర్ముహూర్తం: ఉ.9.06-9.51, మ.12.53-1.39; రాహుకాలం: ఉ.11.05-12.30; అమృతఘడియలు: తె.5.24-7.10; శుభసమయం: మ.1.40-3.00;

సూర్యోదయం: 6.49

సూర్యాస్తమయం: 6.12

రేణుకా చౌదరికి పొగరు!

- అది చూసి నాకు అసహనంగా ఉంది
- మణిశంకర్ అయ్యర్‌దీ అదే పరిస్థితి
- కాంగ్రెస్ మూల్యం చెల్లించాల్సి వస్తోంది
- పార్టీ నాయకుడు పూనావాలా ట్వీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:



దక్షిణాది నేతలపై ఉత్తరాది ప్రాంతానికి చెందిన నాయకుల అహంకారం మరోసారి బయటపడింది. కొన్ని రోజులుగా పదేపదే దక్షిణాది నాయకులు, అందులోనూ ముఖ్యంగా ఏపీ ప్రాంతానికి చెందిన వివిధ మిగతా 5లో..

కార్పొరేట్ కక్కుర్తి

రీయింబర్స్‌మెంట్ డబ్బులు స్వాహా



- ఒక్కో విద్యార్థికి రూ.4700 ఫీజు
- అదంతా కళాశాల ఖాతాలో జమ
- విద్యార్థులకు తిరిగివ్వని కాలేజీలు
- ఫీజులోంచి మినహాయింపూ కల్ల
- జన జాగరణ సమితి ఆందోళన

విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (మనం న్యూస్‌బ్యూరో): కార్పొరేట్ కళాశాలల కక్కుర్తి మరీ మితిమీరిపోతోంది. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల నుంచి వేలు.. లక్షల్లో ఫీజులు వసూలుచేస్తున్న కాలేజీలు, వారిలో మిగతా 5లో..



బంగ్లా మాజీ ప్రధానికి ఐదేళ్ల జైలు

- ట్రస్టుల పేరుతో సొమ్ము స్వాహా
- ఖలీదా జియా కుమారుడికి పదేళ్ల జైలు
- మరో ముగ్గురికి కూడా శిక్ష
- బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు తీర్పు

7లో..


పర్యావరణం దెబ్బతినకుండా పరిష్కారం

- కొల్లేరు సమస్యపై వెంకయ్య సూచన
- ఉప రాష్ట్రపతిని కలిసిన కామినేని, హరిబాబు
- కేంద్రమంత్రి హర్షవర్ధన్‌తో సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: పర్యావరణ సమతుల్యతకు భంగం కలగని రీతిలో కొల్లేరు సరస్సుపై ఆధారపడిన బాధితుల సమస్యను పరిష్కరించాలని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. కేంద్ర నిపుణుల కమిటీతో పాటు ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదికలను ఉమ్మడిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు చెప్పారు. పార్లమెంటు ఆవరణలో వెంకయ్యను గురువారం ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్, బీజేపీ ఎంపీలు కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు కలిశారు. కొల్లేరు సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్, అటవీ శాక డీజీ సిద్ధాంత దాస్, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి సి.కె.మిశ్రా ఇతర ఉన్నతాధికారులను పిలిపించి ఉప రాష్ట్రపతి మాట్లాడారు. కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు అన్యాయం జరగకుండా సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. అనంతరం కామినేని మీడియాతో మాట్లాడుతూ.. తాము ఢిల్లీకి రాజకీయ కారణాలతో రాలేదని, కొల్లేరు సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు వచ్చామని చెప్పారు. కొల్లేరు సమస్యపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి ఒక నివేదిక పంపిందని ఈ భేటీలో చెప్పామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన నివేదిక... కేంద్ర ప్రభుత్వం వేసిన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికకు దగ్గరగా ఉందని చెప్పారు. వెంకయ్యకు కొల్లేరు సమస్యపై అవగాహన ఉన్నందున కేంద్ర మంత్రికి ఆయన పూర్తిగా వివరించి.. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారన్నారు. దీనికి కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ సానుకూలంగా స్పందించారన్నారు. నేషనల్ బోర్డు వైల్డ్ లైఫ్ సమావేశం మార్చి మొదటివారంలో జరగనుందని, అందులో రెండు నివేదికలను పరిశీలించి సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారని వెల్లడించారు.

ఏపీకి బీజేపీ చాలా చేసింది


టీడీపీకి మిత్రపక్షంగా ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్‌కు చాలా చేసిందని, రాష్ట్రానికి ఇచ్చిన హామీలన్నీ కేంద్రం



నెరవేరుస్తోందని కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఈ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేల్లోగా కేంద్రం సంతృప్తికర సమాధానం ఇస్తుందని భావిస్తున్నామన్నారు. ప్రస్తుత ఉద్రిక్త వాతావరణంలో పొత్తు కొనసాగుతుందా అని పశ్నించగా.. ఈ విషయంపై ఇరు పార్టీల అధ్యక్షులు మాట్లాడుకుంటారని, తాము దీనిపై వ్యాఖ్యానించబోమని చెప్పారు. ఏపీకి బీజేపీ ఏం చేసిందో శుక్రవారం తమ ఎంపీలు కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు చెబుతారని అన్నారు. కాగా, బంద్‌ల వల్ల ప్రజాజీవనానికి ఇబ్బందులు కలగడం తప్ప నాయ్యం జరగదని కామినేని చెప్పారు. సమస్యలుంటే పార్లమెంటులోనో శాసనసభలోనో చర్చించాలని అన్నారు.

ఆకాంక్షలు నెరవేరేదాకా పోరాటం

- టీడీపీకి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: కళా



అమరావతి, ఫిబ్రవరి 8 (మనం ప్రతినిధి): ఐదు కోట్ల ఆంధ్రప్రజల ఆకాంక్షలు నెరవేరే దాకా పోరాటం ఆగదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీల నిరసనకు సంఘీభావంగా ఆయన గుంటూరులోని లాడ్జీ సెంటర్ వద్ద పార్టీ కార్యకర్తలతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర బంద్‌కు తమ పార్టీ పిలుపునివ్వలేదని.. ప్రజల ఆకాంక్షను నిరసన రూపంలో తెలియజేయాలనే ఈ కార్యక్రమాలను తలపెట్టామన్నారు. టీడీపీకి రాజకీయ ప్రయోజనాల కన్నా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష వైసీపీ మాత్రం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడుతోందని విమర్శించారు. వైసీపీ కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ గేమ్ ఆడుతోందని, కేంద్రంలో బడ్జెట్ బాగుందని, రాష్ట్రంలో బాగోలేదని తమ కార్యకర్తలతో ప్రతిపక్షనేత జగన్ మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాగా పవన్ కల్యాణ్ జేఏసీపై తాము ఏమీ మాట్లాడలేనని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసేవారందరితోనూ కలుపుకొని పోతామని మంత్రి కళా వెంకట్రావు పేర్కొన్నారు.


ప్రతిపక్షం డ్రామాలాడుతోంది

- కేంద్రం వైఖరిపై ప్రజల్లో ఆగ్రహం: ఆనంద్‌బాబు



అమరావతి, ఫిబ్రవరి 8 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము తీవ్రస్థాయిలో పోరాడుతుంటే.. ప్రతిపక్షం డ్రామాలాడుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు మండిపడ్డారు. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీల ఆందోళనకు మద్దతుగా గుంటూరులోని లాడ్జీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆనంద్ బాబు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రం ఏపీకి తక్షణమే విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో కేంద్ర వైఖరిపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని మంత్రి ఆనంద్‌బాబు పేర్కొన్నారు.

ఢిల్లీలో ధర్నా చేస్తాం



- రాష్ట్ర హక్కులు సాధిస్తాం: అఖిల ప్రియ

కర్నూలు/ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 8 (మనంన్యూస్): కేంద్ర బడ్జెట్ విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, బీజేపీ మిత్రధర్మాన్ని పాటించడం లేదని మంత్రి అఖిల ప్రియ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించకపోగా, అనగదొక్కడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. విభజన హామీల అమలుకు పార్లమెంటులో పోరాడుతున్న టీడీపీ ఎంపీలకు సంఘీభావంగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో మంత్రి అఖిల ప్రియ.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఇతర సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నాలుగేళ్ల క్రితం నరేంద్రమోదీపై నమ్మకంతో బీజేపీతో పొత్తుపెట్టుకున్నామని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఆంధ్ర ప్రదేశ్‌కు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 33 సార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిశారని, అయినా హామీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటు తలుపులు మూసి ఆంధ్రప్రదేశ్‌ను విడదీసి బిల్లును ఆమోదిస్తే.. నేడు బీజేపీ ప్రభుత్వం తలుపులు తెరిచి మోసం చేస్తోందని అఖిల ప్రియ విమర్శించారు. ముఖ్యమంత్రి సహనంతో ఉన్నారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే ఢిల్లీలో కూడా ధర్నా చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర హక్కులు సాధిస్తామని అన్నారు.


బీజేపీతో పొత్తుపై సమీక్షిస్తాం

- రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: గంటా



విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంతో పొత్తుపై పునః సమీక్ష జరుపుతామని రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. గాజువాకలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలకంటే కేంద్ర ప్రభుత్వంతో పొత్తు ముఖ్యమేమి కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే కేంద్ర నిర్ణయాలను వ్యతిరేకిస్తామని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే కఠోర నిర్ణయాలు తీసుకొనేందుకు కూడా ముఖ్యమంత్రి వెనుకాడబోరని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీ బంద్‌లో పాల్గొన్నదని, జిల్లాలో బంద్ విజయవంతమైందని ఆయన అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న బంద్ గురించి దుబాయ్‌లో ఉన్న ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకొంటున్నారని మంత్రి చెప్పారు. గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కేంద్రానికి చంద్రబాబు సాగిల: మేకపాటి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్ సమస్యలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో చేసిన ప్రకటన కొత్త సీసాలో పాత సారాలా ఉందని వైఎస్ఆర్‌సీపీపీ నేత మేకపాటి రాజమోహన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా నిలబెట్టాలనే చిత్తశుద్ధి నిజంగా ఉంటే కేంద్రంలోని మంత్రులతో, ఎంపీలతో రాజీనామా చేయించాలని అన్నారు. రాష్ట్ర మంత్రులను, ఎంపీలను ముందు కూర్చొబెట్టుకుని ఏపీకి ఒరగబెట్టేలా ఏదో తీవ్రంగా చర్చిస్తున్నట్లు చంద్రబాబు నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. నాలుగేళ్లుగా విభజన చట్టంలోని హామీలను అమలు చేయించలేకపోయారని దుయ్యబట్టారు. ఇంకా చూస్తాం, చేస్తాం అంటూ బీజేపీ ప్రభుత్వం చెప్పడం దారుణమని వ్యాఖ్యానించారు. చంద్రబాబు రాష్ట్రం గురించి కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రం ముందు సాగిలపడ్డారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి పచ్చి అవకాశవాదిగా మారడం కన్నా దారుణం మరోటి లేదని మేకపాటి అన్నారు.

కేంద్రం మీద మనదే పైచేయి

ఇప్పటికే కొంత సాధించాం.. నిరసనలు ఉధృతం చేయండి



- సభ నుంచి గెంటేసినా పర్వాలేదు
- ఏపీపై కేంద్రానికి ఎందుకింత వివక్ష
- అరుణ్‌జైట్లీ ప్రసంగాన్ని వినండి
- ప్యాకేజీ ప్రస్తావన లేకపోతే ఆందోళన
- అన్ని పార్టీల మద్దతు తీసుకోండి
- ఆకట్టుకున్న జయదేవ్ ప్రసంగం
- ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 8 (మనం ప్రతినిధి): పార్లమెంటులో ఎంపీలంతా నిరసనలను ఇంకా ఉధృతం చేయాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపీలను ఆదేశించారు. ఏపీకి జరిగిన అన్యాయాన్ని పార్లమెంటులోని అన్ని పార్టీలకు వివరించి వారి మద్దతు కూడా తీసుకోవాలని సూచించారు. గురువారం ఆయన పార్టీ ఎంపీలతో దుబాయ్ నుంచి టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బుధవారం పార్లమెంటులో ప్రధాని చేసిన ప్రసంగంలో ఏపీకి ఉపయోగపడే అంశాలేవీ లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ అంటే కేంద్రానికి లెక్కలేనప్పుడు, మనం తీవ్రస్థాయిలో పోరాడాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటులో ఎంపీలు చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ఎంపీలు బాగా పనిచేశారని కితాబిచ్చారు. గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ప్రసంగం పార్లమెంట్‌లో రక్తికట్టిందని, ప్రజలను ఆకట్టుకునేలా ఉందని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రసంగాన్ని అడ్డుకోకుండా పూర్తిగా వినాలని సూచించారు. ప్రసంగంలో స్పష్టమైన హామీ లేకపోతే నిరసనలు ఉధృతం చేయాలని తమ పార్టీ ఎంపీలకు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలన్నింటితో సమానంగా ఎదిగే వరకు అండగా ఉండాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. భారతదేశంలో ఏపీ భాగం కాదా?.. ఎందుకింత వివక్ష అని బాబు ప్రశ్నించారు. ''ఐదు కోట్ల మంది ఆంధ్రులకు న్యాయం జరగాలి. అదే మన అజెండా. పార్లమెంటులో మన వాళ్ల వ్యూహం ఫలించింది. కేంద్రం మన గురించి ఆలోచించేలా చేయగలిగాం. ఒకరకంగా కేంద్రంమీద పైచేయి సాధించాం. కానీ చట్టంలోని అన్ని హామీలు అమలయ్యేలా చూడాలి. అప్పటివరకు కేంద్రంపై ఒత్తిడి చేస్తూనే ఉండాలి. ఎవరికీ మనం భయపడాల్సిన పనిలేదు. సభ నుంచి గెంటేసినా ఫరవాలేదు. ప్రధాని స్పష్టమైన హామీ ఇచ్చేవరకు మన పోరాటం ఆగదు'' అని చంద్రబాబు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

కేసుల గురించే వైసీపీ లాలూచీ

విభజన సమయంలో కేసుల కోసం వైసీపీ లాలూచీ పడిందని చంద్రబాబు ఆరోపించారు. ఎక్కడైనా ప్రతిపక్షం ముందుండి ఆందోళన చేయాలి. కానీ, కేసుల భయంతో ఉన్న వైసీపీకి ఆ పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. ఎంపీల పోరాటానికి మద్దతుగా రాష్ట్రంలో శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించండి

బంద్ నిర్వహణపై అణచివేత వద్దు.. పోలీసులకు సీఎం చంద్రబాబు సూచన

అమరావతి, ఫిబ్రవరి 8(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఏకమై బంద్ పాటిస్తున్నారని, ప్రజల్లో ఉన్న సెంటిమెంట్‌ను గౌరవించి శాంతియుత నిరసనలకు పోలీసులు సహకరించాలని సీఎం చంద్రబాబు సూచించారు. దుబాయ్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో గురువారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విభజన జరిగి నాలుగేళ్లు గడిచినా ఇంకా ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉందని, ప్రజల్లో ఉన్న సెంటిమెంట్‌ను గౌరవించి బంద్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని సీఎం సూచించారు. బంద్ నిర్వాహకులపై అణచివేతకు పాల్పడవద్దని చెప్పారు. ఎక్కడా ఉద్రిక్తత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, హింసాత్మక శక్తుల విషయంలో అప్రమత్తతతో వ్యవహరించాలని హెచ్చరించారు. కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సకాలంలో సక్రమంగా స్పందించాలని ఆదేశించారు. ఏపీకి జరిగిన అన్యాయంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని సీఎం అన్నారు. బంద్ వల్ల పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది పడకుండా చూడాలని, వారికి తాగునీరు, భోజనవసతి కల్పించాలని సూచించారు. కాగా, ఈ టెలికాన్ఫరెన్స్‌లో డీజీపీ మాల కొండయ్య, ఇంటిలిజెన్స్ ఏబీ వెంకటేశ్వరరావు, సీఎంవో కార్యదర్శి రాజమౌళి, రియల్‌టైమ్ గవర్నెన్స్ సీఈవో అహ్మద్‌బాబు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు.

ముద్దుకృష్ణమకు కన్నీటి వీడ్కోలు

- అశేష జనవాహిని మధ్య అంతిమయాత్ర
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- పార్టీలకు అతీతంగా హాజరైన నాయకులు



తిరుపతి, ఫిబ్రవరి 8 (మనం న్యూస్ బ్యూరో): టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడి కి గురువారం అంతిమ వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో మరణించిన ఆయన పార్థివ దేహానికి ప్రజలు, నాయకులు భారీ సంఖ్యలో తరలి వచ్చి నివాళులర్పించారు. చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామపురంలో ఆయన ఇంటికి పార్టీలకతీతంగా నాయకులు తరలివచ్చారు. జిల్లాలో అందరివాడిగా పేరున్న ఆయన లేని లోటు తీర్చలేనిదని పలువురు కన్నీటి పర్యంతం అయ్యారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర మంత్రులు తెలిపారు. ప్రతిపక్ష వైసీపీ నేత, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఉదయం నుంచి ఆయన అక్కడే ఉన్నారు. సాయంత్రం నాలుగు సమయంలో మొదలైన అంతిమ యాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. వైసీపీ నాయకులైన భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముద్దుకృష్ణమ నాయుడి అంతిమ యాత్రలో పార్థివ దేహాన్ని మోశారు. వెంకట్రామపురంలో సొంత వ్యవసాయ భూమిలో ముద్దుకృష్ణమ అంత్యక్రియలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ లాంచనాల మధ్య దహన సంస్కరణలను పూర్తి చేశారు. రాష్ట్ర మంత్రులు అమరనాథరెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, గౌనివారి శ్రీనివాసులు, బీఎన్ రాజసింహులు, జిల్లా కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న, తుడా చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎంపీ చింతామోహన్ తదితరులు ఆయనకు నివాళి అర్పించారు.

సాగర్ జలాలను వదలండి

- ఆరుతడి పంటలను రక్షించండి
- కేఆర్ఎంబీకి రాష్ట్ర సాగునీటి సంఘాల వినతి

విజయవాడ, ఫిబ్రవరి 8 (మనం న్యూస్): నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని రాష్ట్ర సాగునీటి సంఘాలు విజ్ఞప్తి చేశాయి. కృష్ణా జిల్లా 3వ జోన్‌కు చెందిన పలు ప్రాంతాల్లో రైతులు వేసిన ఆరుతడి పంటలను రక్షించాలని కోరాయి. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచనతో జలవనరులశాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వై.పుల్లయ్య చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల చెన్నకేశవరావు, ఇతర సాగునీటి సంఘాల నేతలు విజయవాడలోని కేఆర్ఎంబీ కార్యాలయ కార్యదర్శి ఎ.పరమేశాని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడమ కాలువ ఆయకట్టు కింద ఉన్న (కృష్ణా జిల్లా ప్రాంతంలోని) తిరువూరు, నూజీవీడు, మైలవరం, గన్నవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 3.60 లక్షల ఎకరాల ఆయకట్టులో మిర్చి, పొగాకు, మొక్కజొన్న, పత్తి, మామిడి, మినుము, పసుపు వంటి ఆరుతడి పంటలను రైతులు సాగుచేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నవంబరు, డిసెంబరు, జనవరి నెలలకు మొత్తం 12 టీఎంసీల నీటిని కేఆర్ఎంబీ సాగర్ ఎడమ కాలువ కేటాయించినట్లు తెలిపారు. అయితే నవంబరులో మొదటి విడతగా 2, 3 జోన్లకు 3.78 టీఎంసీలను, రెండో విడతగా జనవరిలో 2.37 టీఎంసీలు విడుదల చేశారన్నారు. ప్రస్తుతం మూడో జోన్‌లో సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్న ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయని, వాటిని కాపాడేందుకు తక్షణం నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కేఆర్ఎంబీ కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపు జాతీయ లోక్ అదాలత్


- విజయవాడలో నిర్వహణ

విజయవాడ, ఫిబ్రవరి 8 (మనం న్యూస్): కేసుల పరిష్కారానికి శనివారం విజయవాడలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాసమితి చైర్మన్ ఎ.వి.రవీంద్రబాబు తెలిపారు. విజయవాడ కోర్టు సముదాయంలో ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి లోక్ అదాలత్ నిర్వహిస్తామని ఆయన చెప్పారు. 3, 5, 6వ లోక్ అదాలత్ బెంచ్‌లకు సంబంధించి 3వ అదనపు జిల్లా జడ్జి ఎం.వెంగయ్య, 4, 7, 11వ లోక్ అదాలత్ బెంచ్‌లకు సంబంధించి 5వ అదనపు జిల్లా జడ్జి ఎం.బబితా, 8, 9 లోక్ అదాలత్ బెంచ్‌లకు సంబంధించి 12వ అదనపు జిల్లా జడ్జి టి.వేణుగోపాలరావు అధ్వర్యంలో కేసుల పర్యవేక్షణ చేపడుతామని పేర్కొన్నారు.

చక్కెర కర్మాగారాలకు ఊరట

పంచదార దిగుమతులపై సుంకం పెంపు.. పెరగనున్న పంచదార ధరలు

హర్షం వ్యక్తం చేసిన ఫ్యాక్టరీల యాజమాన్యాలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 8 (మనం న్యూస్‌బ్యూరో): ధరల పతనంతో సతమతమై.. నిర్వహణే భారంగా మారిన చక్కెర కర్మాగారాలపై కేంద్రం కరుణ చూపింది. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న పంచదారపై విధిస్తున్న దిగుమతి సుంకాన్ని 50 శాతం రెట్టింపు చేయడం ద్వారా దేశీయ కంపెనీలకు ఉపశమనాన్నిచ్చింది. రాష్ట్రంలోని చక్కెర కర్మాగారాలు, ముఖ్యంగా సహకార రంగంలో నడుస్తున్న చక్కర కర్మాగారాలకు ఇది కొంత ఊరట కలిగించే విషయమే. మార్కెట్‌లో ఇప్పుడు పంచదార హోల్‌సేల్ ధర క్వింటా రూ. 3200గా వుంది. ఫ్యాక్టరీల యాజమాన్యాలు మాత్రం వ్యాపారులకు క్వింటా రూ.3050కే విక్రయించాల్సివస్తుంది. బహిరంగ మార్కెట్‌లో రిటైల్ ధర కిలో రూ. 36గా వుంది. గత ఏడాది పంచదార రిటైల్ ధర రూ.44 వరకూ వెళ్లింది. ఫ్యాక్టరీలు క్వింటా రూ. 3800 వరకూ విక్రయించాయి. గత కొద్ది సంవత్సరాల్లో ఇదే అధిక ధర. అయితే, ఆ తరువాత విదేశాల నుంచి తక్కువ ధరకు పెద్ద ఎత్తున పంచదార దిగుమతి కావడంతో ధర లు ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో, దేశీయ ఫ్యాక్టరీల్లో లక్షల టన్నుల్లో పంచదార నిల్వలుండిపోయాయి. మార్కెట్ ధరల ప్రకారం రూ.3050కే క్వింటా విక్రయించడం గిట్టుబాటు కాక ప్రభుత్వ ఆధీనంలో నడిచే సహకార చక్కెర కర్మాగారాలు దాదాపుగా అమ్మకాలను నిలిపివేశాయి.

ఉత్పత్తి ఖర్చే రూ.3700

క్వింటా పంచదార ఉత్పత్తికి సహకార కర్మాగారాలకు రూ.3700 వరకూ ఖర్చు అవుతుండటంతో క్వింటాపై రూ. 650ల నష్టం చవిచూడాల్సొస్తుంది. ఈ నష్టాన్ని భరించలేక ఫ్యాక్టరీలు అమ్మకాలను నిలిపివేశాయి. దేశీయ ఉత్పత్తి పెరగడంతో పాటు, విదేశాల నుంచి చౌకగా పంచదార దిగుమతి అవుతుండడమే ఇందుకు కారణమని భావించిన అధికారులు కేంద్రంపై ఒత్తిడి పెంచారు. దిగుమతి సుంకం విధించకపోతే దేశీయ ఫ్యాక్టరీల మనుగడ కష్టమన్న అభిప్రాయానికి వచ్చిన కేంద్రం 50 శాతం సుంకాన్ని విధించింది. ఈ నిర్ణయం కారణంగా ఉత్తరాంధ్రలోని గోవాడ, ఏటికొప్పాక, తాండవ, భీమసింగి తదితర సహకార కర్మాగారాల్లో నిలిచిపోయిన అమ్మకాలు తిరిగి ప్రారంభమవుతాయని అధికారులు ఆశిస్తున్నారు.



పెరగనున్న ధరలు

దిగుమతి సుంకం విధించిన కారణంగా బహిరంగ మార్కెట్‌లో పంచదార ధరలు కూడా పెరగనున్నాయి. రిటైల్ మార్కెట్‌లో పంచదార కిలో రూ.40ను దాటనుంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఫ్యాక్టరీల వద్ద క్వింటా ధర రూ.3800 పలికింది. కాస్త ఆలస్యంగా అయినా ఆ పరిస్థితులు వస్తాయని ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఆశిస్తున్నాయి. ధరలు ఎంత పెరిగితే అంత మంచిదని ఫ్యాక్టరీలు కష్టాల నుంచి బయటపడతాయని, రైతుల బకాయిలను వెంటనే తీర్చడం సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం శూన్యం

చెరకు రైతులు, చక్కెర మిల్లులను ఆదుకొనేందుకు కేంద్రం దిగుమతి సుంకాలను పెంచగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏమాత్రం సహకారం అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్ పంపిణీ కోసం జరిపే కొనుగోళ్లలో, తిరుమల తిరుపతి దేవస్థానం చేసే భారీ చక్కెర కొనుగోళ్లలో రాష్ట్రంలోని సహకార ఫ్యాక్టరీలకు ఏమాత్రం ప్రాధాన్యతను ఇవ్వడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తమ కమీషన్ల కోసం ప్రభుత్వం నడిపే ఫ్యాక్టరీల నే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

మనం కుటుంబం
శుక్రవారం, 9 ఫిబ్రవరి 2018
www.manamnews.com

వీకెండ్ వస్తోంది ఏం చేద్దాం అని ఆలోచిస్తున్నారా? అయితే మీలాంటి ట్రావెల్ ఫ్రీక్స్‌కు సూపర్ ఐడియా! గోవా చుట్టి రండి. ఎందుకంటే గోవాలో బీచుల అందాలే కాదు, ఇప్పుడు మీరు గోవా వెళ్తే, గోవన్ సంప్రదాయాలను కళ్లారా చూసే ఛాన్స్ దొరుకుతుంది. ఎందుకంటే ఇది 'గోవన్ కార్నివాల్' సమయం మరి.



కార్నివాల్ టైం



carnival time

బ్రెజిల్ వెళ్లలేకపోతే..

జనరల్‌గా కార్నివాల్ అంటే అందరికీ ఠకీమని గుర్తుకు వచ్చేది బ్రెజిల్. కానీ బ్రెజిల్ వెళ్లలేని వారు మనదేశంలోనే జరిగే గోవన్ కార్నివాల్ చూస్తే సరిపోతుంది. బ్రెజిల్ స్థాయిలో లేకపోయినా అదే స్టైల్‌లో ఉండే ఈ కార్నివాల్ చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుంది. చిన్నా, పెద్దా అందరినీ అట్రాక్ట్ చేసే ఈ కార్నివాల్ గెటప్స్, ఫుడ్, వాహనాలు భలే ఆసక్తిగొలుపుతాయి.

శనివారం స్టార్ట్

గోవన్ టూరిజంలో స్పెషల్ అట్రాక్షన్ అయిన ఈ కార్నివాల్ శనివారం ప్రారంభమవుతుంది. ప్రతి ఏటా ఫిబ్రవరిలో జరిగే ఈ ఫెస్టివల్‌కు దేశ విదేశాలనుంచి పర్యాటకులు తరలివస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి 13 వరకూ జరిగే కార్నివాల్‌కు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. లోకల్స్, ట్రావెలర్స్‌ను సంతోషపరిచేలా నాలుగు రోజుల కార్నివాల్ గోవాలోని వివిధ బీచుల్లో ఒక్కో రోజు ఒక్కో వేదికగా సాగుతాయి.

వసంత ఆగమనంతోనే..

గోవన్ కార్నివాల్ ఈనాటిది కాదు. పోర్చుగీస్ వారు గోవాను పరిపాలించే కాలంలో మొదలైన ఈ సంప్రదాయంలో భాగంగా, 18వ శతాబ్దం నుంచి ఇక్కడ ఏటా కార్నివాల్ నిర్వహిస్తున్నారు. వసంతరుతువు ఆగమనాన్ని పురస్కరించుకుని, ప్రకృతిని ఆరాధిస్తూ, సరికొత్త చిగుర్లను ఆస్వాదిస్తూ, ప్రకృతిలో మమేకమై సాగడమే ఈ కార్నివాల్ ఆంతర్యం. ఈస్టర్‌కు ముందు 40 రోజుల పాటు లెంట్‌ను ఆచరించే ముందు సాగే కార్నివాల్, గోవా రాజధాని పంజిమ్‌లో కింగ్ మోమో రాకతో స్టార్ట్ అవుతుంది. మపుసా, వాస్కో, పంజిమ్ బీచుల్లో సకల హంగులతో సాగే కార్నివాల్‌ను మీరు చూసిరండి, మరెందుకు ఆలస్యం?

వీధుల్లో పెరేడ్ సందడి

కార్నివాల్ అంటేనే వీధుల్లో చేసే సందడి కావడంతో, లైట్స్, మ్యూజిక్, డ్యాన్స్‌తో గోవా వీధులన్నీ మారుమోగనున్నాయి. పోర్చుగీస్ కల్చర్, ఇండియన్ కల్చర్ కలబోసిన ఫ్యూజన్ కల్చర్‌తో సాగే కార్నివాల్ ర్యాలీలు వావ్ అనిపిస్తాయి. ఫన్నీ కాస్ట్యూమ్స్, చిత్ర విచిత్రమైన మాస్కులు, ఫీట్లు చేసే ఎంటర్‌టైనర్స్ ఈ పెరేడ్స్‌లో హైలైట్‌గా నిలుస్తాయి. ఇక ఫొటోలు, వీడియోలు, సెల్ఫీలు తీసుకునే వారికైతే లెక్కలేనన్ని సందర్భాలు లెన్స్‌కు చిక్కేలా చూడచక్కగా ఉంటాయి. ఒక్కమారు మీరు ఈ కార్నివాల్ వెళితే, జీవితకాలానికి సరిపడా ఆనందాన్ని వెంటతెచ్చుకోవచ్చు. మనదేశంలో కార్నివాల్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న గోవాలో, ఒక్కమారైనా కార్నివాల్ సెలబ్రేషన్ చూసితీరాల్సిందే.



వరల్డ్ మ్యూజిక్ ఫెస్ట్



మ్యూజిక్ అంటే మీరు చెవి కోసుకుంటారా? మీలాంటి వారికోసమే వరల్డ్ మ్యూజిక్ ఫెస్టివల్ మళ్లీ వచ్చింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే మ్యూజిక్ ఫెస్ట్‌లో, మ్యూజిక్‌తో మ్యాజిక్ చేసే హేమాహేమీలు మిమ్మల్ని అలరించనున్నారు. శంకర్-ఎహసాన్-లాయ్‌తోపాటు బోలెడు ఫ్యూజన్ బ్యాండ్లు కూడా ఇక్కడ సందడి చేస్తాయి. డై హార్డ్ మ్యూజిక్ ఫ్యాన్స్ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్స్‌లో చిందేసే ఛాన్స్ కొట్టేయాలంటే 'సిటీ ఆఫ్ లేక్స్' అని పేరుగాంచిన ఉదయ్‌పూర్‌కు వచ్చి వాలాల్సిందే.

ఎంట్రీ ఫ్రీ

ప్రపంచం నలుమూలలనుంచి మొత్తం 150 మంది ఆర్టిస్టులు ఈ ఫెస్ట్‌లో అలరించనున్నారు. 16 దేశాల నుంచి వివిధ మ్యూజిక్ జాన్రేలలో ముంచెత్తే కళాకారుల ప్రతిభను ఎంజాయ్ చేసేందుకు వచ్చిన టూరిస్టులతో ఉదయ్‌పూర్ కిటకిటలాడుతోంది. ఎవరైనా ఈ షోలకు ఫ్రీగా ఎంటర్ అయ్యే సదుపాయం ఉంది. ఉదయ్‌పూర్ సిటీ అందాలతోపాటు ఉదయ్‌పూర్ వరల్డ్ మ్యూజిక్ ఫెస్ట్ 2018ని కూడా ఆస్వాదించాలంటే ఇదే సరైన సమయం. ఎలాగూ శనివారం, ఆదివారం కలిసి వస్తాయి కనుక మీ ఫ్యామిలీతో, లేదా ఫ్రెండ్స్‌తో కలిసి హ్యాపీగా వెళ్లి వెకేషన్‌ను ఎంజాయ్ చేసేందుకు మంచి సందర్భం కూడా.



చాక్లెట్ డే



వాలెంటైన్ వీక్‌లో భాగంగా వచ్చే 'వరల్డ్ చాక్లెట్ డే'ని ఫిబ్రవరి 9న ప్రపంచ వ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకుంటారు. ఎవరైనా మనపై అలిగినా, మనల్ని మెచ్చుకున్నా మనం వారికి ప్రతిగా ఇచ్చేవాటిలో తప్పకుండా ఉండేవి చాక్లెట్లు. చిన్నారులకు చాక్లెట్లంటే ఆరోప్రాణం. మన జీవితంలో భాగమైన చాక్లెట్లంటే అందరికీ నోరూరుతుంది. ప్రపంచంలో ఫైనెస్ట్ చాక్లెట్లు బ్రెజిల్‌లో తయారవుతాయి. ఇక మనదేశంలోని అన్ని హిల్ స్టేషన్స్‌లోనూ చాక్లెట్లు 'స్వగృహ' పరిశ్రమగా ఉంది. ఊటీ, కొడై, కూర్గ్, నైనిటాల్ ఇలా ఏ కొండ ప్రాంతానికి వెళ్లినా ఇళ్లలో తయారు చేసిన బోలెడు ఫ్లేవర్ల చాక్లెట్లు విరివిగా దొరుకుతాయి. ఎవరిపైన అయినా మనకు ప్రత్యేకమైన గౌరవం, అభిమానం ఉన్నాయనుకొండి దాన్ని ఎక్స్‌ప్రెస్ చేసేందుకు చాక్లెట్లు మంచి సాధనం. అందుకే గిఫ్ట్ ర్యాప్డ్ చాక్లెట్స్, చాక్లెట్ బొకేలు ఇలా వినూత్నమైన చాక్లెట్ గిఫ్ట్లు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.



మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శుక్రవారం, ఫిబ్రవరి 9

మోదీ ప్రసంగం


పార్లమెంటు ఉభయసభల్లో నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం కాంగ్రెస్‌పై నిప్పులు చిమ్మింది. బుధవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ ప్రజాస్వామ్యమనే పదాన్ని ఉచ్ఛరించే అర్హత కాంగ్రెస్‌కు లేదని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్లమెంటు ఉభయ సభల తలుపులు మూసి హడావుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించడం వల్ల ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు పడుతోందని మాట్లాడారు. ప్రత్యేక హోదాను తిరస్కరించడంతోపాటు, బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు; తొందరపాటుతో రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర విభజన చేయడం వల్ల అనేక సమస్య లొచ్చాయని మోదీ చేసిన వ్యాఖ్యానంపై తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అయితే తెలంగాణ ఏర్పాటుకు, ఆ రాష్ట్ర అభివృద్ధికి మేం పూర్తి మద్దతు ఇచ్చామని తెలిపారు. వాజ్‌పేయి ప్రభుత్వం మూడు రాష్ట్రాలను విభజించినా ఒక్క సమస్య రాలేదని, కాంగ్రెస్ పార్టీ నిర్వాకం వల్లనే ఆంధ్ర ప్రజలు ఇప్పుడు అనేక కష్టాలపాలవుతున్నారని, తమ తప్పేమీ లేదన్నట్టు విభజన జరిగి నాలుగేళ్ళయిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడటం దురదృష్టకరం. రాష్ట్రపతి ప్రసంగాన్ని అడ్డుకోవడానికి కాంగ్రెస్, దాని మిత్రపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలివ్వడంతో ఆవేశానికి గురైన మోదీ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని చరిత్రను తవ్వి పోసారు. అయితే బడ్జెట్‌లో ఏపీ రెవెన్యూ లోటు నూతన రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోన్ ఏర్పాటు వంటి ముఖ్యమైన అంశాల ప్రస్తావనేమీ లేకపోవడంతో రాష్ట్రంలోని రాజకీయ పక్షాలతోపాటు ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్, వామపక్షాలు, వైసీపీ, జనసేన తదితర రాజకీయ పక్షాలన్నీ విజయవంతంగా బంద్ నిర్వహించడం సమస్య తీవ్రతను తెలియజేస్తుంది.

బడ్జెట్ కేటాయింపుల్లో మొండి చేయి చూపిన తీరుపై రాష్ట్రం రగులుతున్న సమయంలో మోదీ ప్రసంగం తెలుగు రాష్ట్రాల ప్రజల పట్ల, వారి ఆకాంక్షల పట్ల ఆయన ప్రభుత్వానికున్న చిన్నచూపునకు అద్దం పడుతోంది. బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రెండు రోజుల నుంచి వైసీపీతో పాటు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన టీడీపీ ఎంపీలూ పార్లమెంటు ఉభయసభల్లో నిరసన వ్యక్తం చేస్తున్నా ఏ మాత్రం పట్టించుకోని ప్రధాని మోదీ ధన్యవాద ప్రసంగంలో ఈ సమస్యను పక్కకు తప్పించి గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన పనులన్నిటినీ ఏకరువు పెడుతూ విమర్శలకు పూనుకున్నారు. మోదీ ప్రభుత్వం తెలుగు ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై అటు పార్లమెంటులోనూ, ఇటు తెలుగు రాష్ట్రాలలోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో అఖిలపక్షాలు తలపెట్టిన బంద్ పూర్తి స్థాయిలో విజయవంతమైంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తీరుపై కాంగ్రెస్ లక్ష్యంగా దురుసుగా వ్యాఖ్యానించడంపై తెలంగాణ ప్రజలూ అసంతృప్తికి గురయ్యారు. దశాబ్దాలుగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను గుర్తిస్తూ అదే వాజ్‌పేయి ప్రభుత్వం ఆ మూడు రాష్ట్రాలతో పాటే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని కూడా ఎందుకు ఏర్పాటు చేయలేదని, ఆనాడు ఆంధ్ర లాబీకి లొంగిపోయి వాజ్‌పేయి ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సుదీర్ఘకాలం పాటు సాగిన ఉద్యమం పరాకాష్ఠకు చేరిన తరుణంలో పార్లమెంట్‌లో విభజన తీర్మానం చేయక తప్పని పరిస్థితిని తొందర పాటు చర్యగా వ్యాఖ్యానించడం తెలంగాణ ప్రజలను అవమానించినట్లు కాదా అని పలువురు తెలంగాణ నేతలు మోదీ ప్రసంగాన్ని విమర్శిస్తున్నారు. నరేంద్ర మోదీ అసలు సమస్యలను వదిలి పాత గాయాలను కెలకడం ద్వారా ప్రజల హృదయాలను మళ్ళీ బాధపెట్టారు.

ఇటీవలి ఎన్నికలలో బీజేపీ ప్రాభవం తగ్గిన సూచనలు కనిపించడం మోదీపై ఒత్తిడి పెంచాయి. ఐదేళ్ళలో ఎన్డీయే ప్రభుత్వం సాధించిన విజయాలేమిటన్నది తలెత్తకుండా, దానికి కారణం గతంలో కాంగ్రెస్ విధానాలేనని తప్పించుకునే వ్యూహంతో ఆయన ప్రసంగం సాగింది. పార్లమెంట్ లోపల, బయట వ్యక్తమవుతున్న నిరసనల నేపథ్యంలో దళిత ముఖ్యమంత్రి అంజయ్యను (వాస్తవంగా ఆయన దళితుడు కాదు) ఘోరంగా అవమానించారని, నీలం సంజీవరెడ్డికి వెన్నుపోటు పొడిచారని.. ఇలా ప్రస్తుత సమస్యలతో సంబంధంలేని పొంతనలేని గత చరిత్రలోని ఘటనలను తప్పుగా పేర్కొంటూ కాంగ్రెస్‌పై మోదీ ప్రసంగం విమర్శలు గుప్పించింది. రాజ్యసభలోనూ ఆయన ప్రసంగం ఇదే మాదిరిగా సాగింది. బ్యాంకుల్లో పేరుకుపోయిన నిరర్థక ఆస్తుల పరిష్కారం, నల్లధనం వెలికిరాకపోవడం, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ తదితర విధానాలు వికటించడంతో దేశం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు కాంగ్రెస్ పార్టీయే కారణమన్నట్లు అధికారం చేపట్టిన నాలుగేళ్ళ తర్వాత ప్రధాని మోదీ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. వచ్చే ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్న తరుణంలో ఎన్డీయే ప్రభుత్వం ఇంతవరకు సాధించినదేమిటో ఆత్మవిమర్శనా పూర్వకంగా మోదీ ప్రసంగించి ఉండాల్సింది.



మంచిమాట



వేలాది వ్యర్థమైన మాటలు వినటం కన్నా... శాంతిని కాంతిని ప్రసాదించే మంచి మాట ఒక్కటి చాలు

- గౌతమ బుద్ధుడు

ఫాసిజం దుర్భాషా? దుస్థితా?



వెన్నెలకంటి రామారావు
సెల్ : 9550367536

ప్రతిఫలనం

ఫాసిజం, ఫాసిస్టు అనే భావనలు నేడు అత్యంత వివాదాస్పద చర్చనీయాంశాలుగా మారాయి. గిట్టని రాజకీయ నాయకులను, గిట్టని విధానాలను, గిట్టని పరిస్థితులను సైతం ఈసడించుకునే రూపంలో ఆ భావనలు వినియోగించడం పరిపాటిగా మారింది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ ఎన్నిక, ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో మరైన్ లీపెన్ పార్టీ (ఫ్రంట్ నేషనల్) సహా యూరప్‌లో చాలా దక్షిణపక్ష పార్టీలు బలోపేతం కావడం; భారత్‌లో అభివృద్ధి నమూనా ముసుగులో హిందుత్వ ఎజెండాను కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రావడం; ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో నిరంకుశ రాజ్యాలు ఏర్పడడం లేదా రాజ్యం బలహీన పడి ఉగ్రవాద సంస్థల ప్రాబల్యం గణనీయంగా పెరగడం వంటి ప్రపంచ పరిణామాలు తలెత్తిన నేపథ్యంలో ఉదారవాదులు, రాడికల్ భావ జాలంతో ఉన్నవారు సదరు వ్యక్తులను, ఉద్యమాలను ఫాసిస్టు అని ముద్ర వేయడం కద్దు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం వంటి కొన్ని పదాలు, భావనలు వాటి అంతస్సారాన్ని కోల్పోయి, కేవలం నిందాపూర్వకంగా లేదా అపవాదుగా వినియోగంలో ఉన్నవాటిలో ఫాసిజం ఒకటి. 'ఫాసిజం పెరుగుతుంద'నే చారిత్రక భయాందోళన కారణంగా ఇలా జరిగిందని కొందరి అభిప్రాయం. ఫ్రాన్స్‌లోని వలసవాద వ్యతిరేక, జాత్యహంకార పార్టీ 'ఫ్రంట్ నేషనల్' కచ్చితంగా అభివృద్ధి నిరోధకమే అయితే దాన్ని కొందరు పూర్తి స్థాయి ఫాసిస్టుగా పరిగణించడం తప్పు. అదే తీరులో ముస్లిం వ్యతిరేకత, హిందుత్వ భావజాలాన్ని జీర్ణించుకున్న బీజేపీ పార్టీ అభివృద్ధి నిరోధక భావజాలాన్ని కలిగి, నిరంకుశంగా పాలిస్తున్నప్పటికీ దాన్ని ఫాసిస్టు పార్టీగా పరిగణించడం ఎంతవరకు సబబు? 70 ఏళ్ళ పరిణామంలోని ఆర్థిక విధానంతో నిర్ణయాత్మకంగా వ్యవహరించని యూపీఏ ప్రభుత్వపు నిష్క్రియాపరత్వం స్థానంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నిక్కచ్చిగా అమలు చేయడానికి ప్రయత్నించడం నిరంకుశత్వమవుతుందా? అమలులో కచ్చితత్వం, అమెరికా అనుకూలత తప్ప యూపీఏ విధానాలతో ఎలాంటి తేడా లేని ఆర్థిక దృక్కోణం కలిగిన బీజేపీని ఫాసిస్టుగా ఖాయపరచి ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసం? ఈ ఏడాది జనవరిలో కోల్‌కతాలో జరిగిన సీపీఐఎం కేంద్ర కమిటీ సమావేశాలు ఆమోదించిన ముసాయిదా రాజకీయ తీర్మానం దేశంలో ఫాసిజం ఉనికిలోకి వచ్చిందా లేదా అనే అంశాన్ని చర్చనీయాంశంగా ముందుకు తెచ్చింది.

దేశంలో ఫాసిజం తలెత్తేందుకు కావలసిన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని అథమ పక్షం చాలా బలహీనమైన స్థితిలో ఉన్నాయని సీపీఎం పార్టీ మాజీ కార్యదర్శి అభిప్రాయం. అయితే పై నుంచి (రాజ్యం) కొన్ని రాజ్యాంగ వ్యవస్థల ద్వారా, కింది స్థాయిలో (పౌర సమాజం) హిందుత్వ మిలిటెంట్ల ద్వారా సమాజాన్ని, రాజకీయాల్ని హిందుత్వ భావజాల మార్గంలో పునర్నిర్మించాలని చూస్తున్నారు. సంఘ్ పరివార్ చేస్తున్న ఈ ప్రయత్నాలు లౌకిక సమాజ సమతుల్యతకు విఘాతం కలిగిస్తుందని కారత్ చెబుతున్నారు. సీపీఎం కేంద్ర కమిటీలోని మెజారిటీ సభ్యులు 'నయా ఉదారవాదం', 'మతతత్వం' కు వ్యతిరేకంగా పోరాటం జరపాలన్న తీర్మానం రీత్యా బీజేపీని, నయా ఉదారవాద విధానాలకు కొమ్ముకాసే కాంగ్రెస్.. ఇద్దర్నీ ప్రత్యర్థులుగానే పరిగణించాలని నిర్ణయించుకున్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఈ దేశ పాలకవర్గాల పార్టీలు కాబట్టి ఎన్నికల్లో పొత్తు పెట్టుకోవడం సూత్రరీత్యా సరికాదు అనే నిర్ణయం సమంజసమే గానీ, ఫాసిస్టు పరిస్థితులు దేశంలో నెలకొనలేదని, బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలన మాత్రమే కొనసాగుతోంది కాబట్టి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం చారిత్రకంగా సరైనది కాదంటున్న కారత్ వాదన ఫాసిజాన్ని అంచనా వేయడంలో వక్రీభవనం చెందింది. పార్లమెంటరీ రాజకీయాల్లో తలమునకలైన వామపక్షాలు వర్గదృక్పథంతో కూడిన సూత్రబద్ధత నుంచి ఏనాడో తప్పుకున్నాయి.



> రాజ్యంలో తీవ్ర ప్రతీఘాతుక ప్రభుత్వం, పౌర సమాజంలో మత విద్వేషకాండను వ్యాప్తి చేసే గుంపులు సమన్వయంతో సాగే విధ్వంసక కార్యకలాపాన్ని ఫాసిజంగా భావించడం జరుగుతుంది. సమాజాన్ని వర్గ సంబంధాలతో రూపొందిన వ్యవస్థగా కాక, రాజ్యం- పౌర సమాజం అనే సామాజిక వర్గీకరణ పునాదిగా అర్థం చేసుకునే వారికి ఫాసిజమనేది కేవలం రాజకీయ కార్యకలాపంగా మాత్రమే అర్థమవుతుంది.

పొత్తులు పెట్టుకోవడం కోసం అవి చేస్తున్న వాదనలన్నీ సాకులుగా మిగిలాయి. కాకపోతే వర్గపోరాటం, వ్యూహం-ఎత్తుగడలు, రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటి ఫాసిస్టు పోరాట ఎత్తుగడలు అనే మాటల మాటున ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవడం వామపక్షాలు సుదీర్ఘకాలం కొనసాగిస్తుండడంతో క్రమంగా చిక్కిశల్యమయ్యాయి. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాలను ఏర్పరచడమే పరమావధిగా పార్లమెంటరీ వామపక్షాలు భావిస్తున్నాయి. పార్లమెంట్ పోరాట విశిష్టతను స్థల కాలాలతో ప్రమేయం లేకుండా తప్పుపట్టడంలేదు. కాకపోతే వర్గపోరాటాన్ని ఎన్నికల పోటీతో పోల్చుకుని తమను తాము సమర్థించుకోవడం, తమను నమ్ముకున్న ప్రజలను ఎన్నికల పొత్తుల వెంట పరుగులెత్తించడం చారిత్రక తప్పిదమనిపిస్తుంది. ఫాసిజం అనేది పాలకవర్గాల చైతన్యపూరిత కార్యకలాపమా లేక వస్తుగత చారిత్రక చలన నియమంలో భాగంగా సంభవించిన సామాజిక-రాజకీయ పరిణామమా? ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన అధికోత్పత్తి సంక్షోభంతో తలెత్తిన సామాజిక అశాంతిని శ్రామికవర్గ పార్టీ విప్లవం రూపంలో పరిష్కరిస్తే, పాలక వర్గ రాజకీయ పక్షాలు ఫాసిజాన్ని అమలు చేయడం ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాయి. అందువల్ల ఒక దేశంలో ఫాసిజం తలెత్తడ మన్నది, అక్కడి రాజకీయ పక్షాల చొరవతో ఏర్పడడంగా కాక, సామాజిక ఆర్థిక జీవితంలో అనివార్యంగా తలెత్తిన సంక్షోభానికి పరిష్కారంగా ఫాసిస్టు రాజకీయ పార్టీలు/ఫాసిస్టు ధోరణితో ఉన్న రాజకీయ పార్టీలు సామాజిక ఆమోదం ద్వారా అధికారంలోకి వచ్చి నిరంకుశ పాలన కొనసాగించడంగా అర్థం చేసుకోవాలి.

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో భారత్ సభ్య దేశంగా చేరినప్పటి నుంచి ఏ పార్లమెంటరీ రాజకీయ పార్టీకైనా డబ్ల్యూటీవో ఒప్పందాన్ని అమలు చేయడం తప్ప తమదైన ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను ప్రత్యేకంగా అమలు చేయడానికి అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా భారతీయ విశిష్టతలతో సాగుతుంటాయి. ప్రపంచార్థిక వ్యవస్థలో నెలకొన్న మహాసంక్షోభం అంతర్జాతీయంగా రాజకీయ వ్యవస్థలన్నిటిలో ప్రకంపనలు సృష్టించింది. అభివృద్ధి చెందిన దేశాలన్నీ సంక్షోభం నుంచి కోలుకునేందుకు, కనీసం కుప్పకూలకుండా మనగలిగేందుకు ఆత్మరక్షణ ఆర్థిక విధానాలను చేపట్టాయి. మాంద్యంలో కూరుకుపోయిన దేశీయ పరిశ్రమలలో కార్మిక అశాంతిని అరికట్టి, ఉత్పత్తి క్రమాన్ని సజావుగా సాగించవలసిన వివిధ కార్మిక వ్యతిరేక చట్టాలు, కార్పొరేట్లకు సబ్సిడీలు, రాయితీ, బెయిల్‌ఔట్‌లు ఇస్తూ, దేశ ప్రజల సంక్షేమాన్ని పాదుపు ఆర్థిక చర్యల పేరుతో కాలరాసే రాజకీయ పార్టీలు అధికారంలోకి రావలసిన అవసరం ఏర్పడింది. ఇలాంటి విధానాలను దేశభక్తి, మత, జాత్యహంకారాల ఉద్రేకాల స్ఫూర్తితో ప్రజామోదాన్ని కూడగట్టిన రాజకీయ పక్షాలు మాత్రమే నిక్కచ్చిగా, నిర్దాక్షిణ్యంగా అమలు చేయగలవు. ఇలాంటి వస్తుగత చారిత్రక అవసరం నుంచి అమెరికా, ఈయూ దేశాలు సహా ప్రపంచవ్యాప్తంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమలులో ఉన్న అనేక దేశాల్లో మితవాద, మతఛాందసవాద, ఫాసిస్టు, ఫాసిస్టు ధోరణి గల పార్టీలు ఎన్నికల్లో భారీ మెజారిటీతో నెగ్గాయి. దాంతో ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన తరుణంలో అంతర్జాతీయ రాజకీయ యవనికపై ఫాసిజం ఒక ప్రబల దృగంశం ముందుకొచ్చింది. సంక్షోభ కాలంలో నిరంకుశంగా ఆర్థిక విధానాలను అమలు చేయగల మితవాద, జాత్యహంకార, మతతత్వ, ఫాసిస్టు రాజకీయ శక్తులను, ఆర్థిక వికాస కాలాల్లో మధ్య మార్గాన్ని అవలంభించే రాజకీయ శక్తులను ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ఎంచుకుంటుంది. అంతేగానీ ఎవరో కొందరు వ్యక్తులో, కొన్ని రాజకీయపక్షాలో, లేదా సంస్థలో పనిగట్టుకొని మతతత్వాన్నో, జాత్యహంకారాన్నో మరేదో దురహంకారాన్నో ప్రచారం చేసి ప్రజలను ఆకట్టుకుని రాజ్యాధికారం చేపట్టి, నిరంకుశ పాలనను అమలు చేస్తారనుకోవడం అశాస్త్రీయం.


2008నుంచి కొనసాగుతున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో ఈయూ, సోవియట్ రష్యా మద్దతుతో చైనా సామ్రాజ్యవాద దేశం అగ్రగామిగా అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా తయారైన కాలంలోను ప్రత్యర్థుల శిబిరాల్లో ఫాసిస్టు /ఫాసిస్టు ధోరణిని పుణికిపుచ్చుకున్న నిరంకుశ రాజ్యాలు ఏర్పడడం లేదా తీవ్ర అంతర్యుద్ధం లేదా ఉగ్రవాద ప్రమాదంలో కూరుకుపోవడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫాసిజమనేది కేవలం రాజకీయ కార్యకలాపంగా అర్థం చేసుకుంటే.. రాజ్యంలో తీవ్ర ప్రతీఘాతుక ప్రభుత్వం, పౌర సమాజంలో మత విద్వేషకాండను వ్యాప్తి చేసే గుంపులు సమన్వయంతో సాగే విధ్వంసక కార్యకలాపాన్ని ఫాసిజంగా భావించడం జరుగుతుంది. సమాజాన్ని వర్గ సంబంధాలతో రూపొందిన వ్యవస్థగా కాక, రాజ్యం-పౌర సమాజం అనే సామాజిక వర్గీకరణ పునాదిగా అర్థం చేసుకునే వారికి ఫాసిజమనేది కేవలం రాజకీయ కార్యకలాపంగా మాత్రమే అర్థమవుతుంది. దాంతో ప్రకాశ్ కారత్‌కు భారత సమాజంలోని ప్రస్తుతం మెజారిటీ మత, కుల, జాత్యహంకారాలతో వ్యవస్థీకృతమవుతున్న ఫాసిజం కనపడలేదు. అలాంటిది సమాజంలో పరువు హత్యలు, గో సంరక్షణ పేరుతో సాగే హత్యాకాండ, మత మారణకాండలు, మత మోరల్ పోలీసింగ్ తదితర రూపాలలో మెజారిటీ మతస్తులను 'ఏకీకృత హిందూ అస్తిత్వం' అనే ఒక క్రూసేడ్ నినాదంతో భారతీయ సమాజాన్ని పునర్నిర్మాణం చేసి, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే సంఘపరివార్ ప్రయత్నాలను అర్థం చేసుకోవడంలో సీపీఎం నేత కారతే కాకుండా పలువురు మధ్యతరగతి విద్యావంతులు, మేధావులు విఫలమయ్యారు. దేశంలో వివృతమవుతున్న ఫాసిజాన్ని నిరోధించకపోతే చారిత్రకంగా ప్రజలు పోరాడి సాధించుకున్న విలువలు, హక్కులు మట్టి పాలవడం ఖాయం. ఫాసిజమనేది ప్రతిఘాతుక సమూహాలు, రాజ్యాన్ని విమర్శించేందుకు ఉపయోగించే దుర్భాష కాదు, అది ముఖ్యంగా సంక్షుభిత సమాజ ఆర్థిక వ్యవస్థ పరిష్కారానికి పాలకవర్గాలు ఎంచుకునే ఒక క్రూరమైన విధానం.

రగులుతున్న తెలుగు గుండెలు

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి రావాల్సిన ప్రయోజనాల కోసం పోరాటం ఉధృతమవుతున్నది. అటు పార్లమెంట్‌లో, ఇటు రాష్ట్రంలో నాయకులు, ప్రజలు తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్నారు. రాష్ట్ర బంద్‌తో ప్రజలు రోడ్డెక్కారు. కేంద్రం ఉపేక్షిస్తే ఇది మరింత ఉధృతమై విభజన నాటి పరిస్థితులు తలెత్తవచ్చు. టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌ను హోరెత్తిస్తున్నారు. గత 4 సంవత్సరాల నుంచి ఓపికపట్టిన తెలుగుదేశం రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాల కోసం ఇక తాత్సారం చేస్తే ప్రయోజనం లేదని గ్రహించింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలు విషయంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నదే తప్ప వాటి అమలుకు చిత్తశుద్ధితో ముందుకు రావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మాభిమానం చంపుకుని అనేక సార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానిని, మంత్రులను కలిసి అనేక వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎటువంటి ప్రయోజనం కలగలేదు.

ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ అడ్డగోలుగా విభజించింది. ఒక పద్ధతి ప్రకారం విభజన జరగలేదు. రాజధాని హైదరాబాద్‌ను ఏకపక్షంగా తెలంగాణకు ఇచ్చివేసి ఉత్తచేతులతో ఆంధ్రా వారిని వెళ్లగొట్టారు. కొత్త రాజధాని నిర్మాణానికి ఆంధ్రాకు నిధులు సైతం మంజూరు చేయలేదు. విద్య, ఉద్యోగాల కోసం రాష్ట్ర ప్రజలందరూ హైదరాబాద్‌పై ఆధారపడి ఉండేవారు. అటువంటిది రాష్ట్ర విభజనకు పూనుకోవడంతో ఆంధ్రా ప్రజలు వంద రోజులకుపైగా ఉద్యమాలతో రాష్ట్రాన్ని అట్టుడికించారు. ఆంధ్రా ఎంపీలు అడ్డగోలు విభజనను అడ్డుకోవడానికి పార్లమెంట్‌లో శతవిధాలా ప్రయత్నించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బలవంతంగా బిల్లును ఆమోదించారు.

2014 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించిందని, తాను రాష్ట్రానికి న్యాయం చేస్తానని, ఢిల్లీకంటే మంచి రాజధానిని నిర్మిస్తానని తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా మోడీ హామీ ఇచ్చారు. తమ పార్టీకి పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ వస్తుందని ఆనాడు బీజేపీ ఊహించలేదు. అందుకే కలిసి వచ్చే పక్షాలతో పొత్తు పెట్టుకున్నది. కానీ ఊహించని విధంగా ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీని వారు సొంతంగా సాధించడంతో, రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడంతో మోడీ కాళ్లు నేలమీద ఆనటం లేదు. మిత్రపక్షాలను ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. ప్రత్యేక హోదాను అటకెక్కించారు. దాని బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి, ఆ తర్వాత దానిని సైతం తుంగలో తొక్కారు. విశాఖ రైల్వే జోన్‌ను సైతం ఇవ్వ లేదు. పోలవరంకు, ఎయిమ్స్‌కు నిధులు కేటాయించడం లేదు. రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వ కుండా మొండిచేయి చూపెడుతున్నారు. మోదీ రాష్ట్రాలకు నిధులు ఇచ్చే అధికారాన్ని నీతిఅయోగ్ చేతిలో పెట్టారు. రాష్ట్రాలు చేతులు కట్టుకుని నీతిఅయోగ్ ఎదుట సాగిల పడాల్సిన పరిస్థితి కల్పించి రాష్ట్రాల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు.



కేంద్రం వెఖరితో విసిగిపోయిన తెలుగుదేశం ఎన్‌డీయే నుంచి తప్పుకుంటే తాను మద్దతు ఇస్తానని జగన్ భరోసా ఇచ్చినందువల్లనే తెలుగుదేశాన్ని ప్రధాని లెక్కచేయడం లేదని తెలుగుదేశం వర్గాలు భావిస్తున్నాయి. ఇదే నిజమైతే బీజేపీ-వైఎస్‌ఆర్ పార్టీలు రెండూ నష్టపోతాయి. ఇన్నాళ్లు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని, అది వస్తేనే రాష్ట్రానికి పరిశ్రమలు, యువతకు ఉద్యోగాలు వస్తాయని ఊరూవాడా ఊదరగొట్టిన జగన్ అదేమీ లేకుండానే పొత్తుపెట్టుకుంటే ప్రజలకు ఏమని సమాధానం చెబుతారు. రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తున్నదని ఆంధ్రా ప్రజలు ఆ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అది గ్రహించే తెలుగుదేశం పక్కకు తప్పుకునే ఆలోచన చేస్తున్నది. అటువంటిది జగన్ ఆ పార్టీతో పొత్తుపెట్టుకుంటే రాజకీయంగా అతడు తగిన మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

ఇవన్నీ ఇలా ఉండగా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు సైతం మొండిచేయి చూపారంటూ తెలంగాణకు చెందిన మంత్రులు విమర్శించారే తప్ప ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై ఇంత వరకు తన స్పందన తెలపలేదు. రాష్ట్రానికి అన్యాయం జరిగినప్పుడు తెలుగుదేశం ఎంపీలతో కలిసి టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఎందుకు తమ గళం వినిపించడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు కలిసి కట్టుగా తమ రాష్ట్రాల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తే దానికి మరింత బలం చేకూరేది. కేంద్రంపై ఒత్తిడి తీవ్రమ య్యేది. తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి పోరాటం చేస్తామని కేంద్రానికి సందే శం ఇచ్చినట్లయ్యేది. కానీ కేసీఆర్ మౌనం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటి? ఈ విషయమై టీఆర్ఎస్‌ను ప్రశ్నించి ఇరుకున పెట్టడంలో తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయి.

రాష్ట్ర ప్రయోజనాల కోసం అంచెలంచెలుగా ఒత్తిడి పెంచి కేంద్రం నుంచి తమ కోర్కెలను సాధించుకోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. అప్పటికీ కేంద్రం మొండికేస్తే తప్పని సరి పరిస్థితిలో కేంద్ర మంత్రుల చేత రాజీనామా చేయించి ఎన్‌డీఏ నుంచి బయటకు రావాలని ఆయన భావిస్తున్నారు. ఆ తదుపరి చర్యగా ఎంపీల చేత రాజీనామా చేయించి ఆంధ్రుల ఆత్మగౌరవం పేరిట ప్రజల్లోకి వెళ్తే తెలుగుదేశం గరిష్ట స్థాయిలో ప్రయోజనం పొందుతుంది. ఇదే వేడిని కొనసాగించి సాధారణ ఎన్నికలకు వెళ్తే గతంలో కన్నా ఆ పార్టీ మరిన్ని స్థానాలలో విజయం సాధించే అవకాశం ఉంది. చంద్రబాబు ఇంతటితో ఊరుకోరని తగిన ప్రతీకార చర్యకు దిగే అవకాశం ఉందని గత చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతున్నది. బీజేపీని వ్యతిరేకించే పార్టీలతో జట్టుకట్టి మళ్లీ థర్డ్ ఫ్రంట్‌కు జీవం పోస్తే ఆయన ఢిల్లీలో మళ్లీ చక్రం తిప్పే అవకాశం ఉంది. బీజేపీపై ఆగ్రహంతో ఉన్న ప్రాంతీయ, జాతీయ పార్టీలు మోదీని ఎదిరించే నాయకుడి కోసం ఎదురు చూస్తున్నాయి. మోదీని ఎదుర్కోవడంలో రాహుల్ గాంధీ వైఫల్యం చెందారు. కనుక ఆ పార్టీలు చంద్రబాబు వెనుక నిలిచే అవకాశం ఉంది. ఈసారి బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించే పరిస్థితి లేదు. ఇక్కడి నుంచి పన్నుల రూపంలో అధికంగా తీసుకెళ్లి ఎంగిలి మెతుకులు రాష్ట్రాలకు విదిలిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి అత్యధిక ఆదాయం వస్తుంటే ప్రాజెక్టులన్నీ ఉత్తరాదికి తరలిపోతున్నాయి. మొదటి నుంచి కేంద్రం దక్షిణాదిపై సవతి తల్లి ప్రేమను వలకబోస్తున్నది. నిధులు, ప్రాజెక్టులే కాదు అవార్డుల విష యంలో సైతం దక్షిణాదిపై చిన్న చూపు చూస్తున్నారు. మంత్రి పదవుల విషయంలో సైతం దక్షిణాది వారికి ముఖ్యంగా తెలుగువారికి అప్రాధాన్య శాఖలు కట్టబెడుతున్నారు. ఈ విషయమై ఎన్నాళ్లు తెలుగు రాష్ట్రాలు భరించి ఉండాలి.

చల్లా శ్రీనివాసరావు
పొలిటికల్ ఎనలిస్ట్
9640654772

బౌద్ధ మహా సమ్మేళనం

కరపత్రం

కడప జిల్లాలో వేల సంవత్సరాల పాటు బౌద్ధం వైభవంగా విరాజిల్లింది. అనంతపురం జిల్లాలోని ఎర్రగుడిలోనూ, కర్నూలు జిల్లా పత్తికొండ తాలూకాలోని రాజుల మందగిరిలోనూ దొరికిన క్రీస్తుపూర్వం 274- 238 కాలంనాటి అశోక చక్రవర్తి వేయించిన శాసనాల ద్వారా కడప జిల్లా చరిత్ర బోధపడుతుంది.

''చులియ'' దేశపు రాజధానికి ఆగ్నేయ దిశలో అశోక చక్రవర్తిచే నిర్మించ బడిన బౌద్ధ స్థూపం వున్నట్లు చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ పేర్కొన్నాడు. ఈ స్థూపమే కడప జిల్లా అడపూరు(నందలూరు)లో వున్న బౌద్ధ స్థూపంగా గుర్తించబడినది.

భారతదేశంలో బౌద్ధులు రెండు రకాల స్థూపాలు నిర్మించారు. ఒకటి 'శారీరక స్థూపాలు' రెండోవి 'ఉద్దేశిక స్థూపాలు' గౌతమ బుద్ధుడి మహా పరినిర్వాణం తర్వాత ఆయన శారీరక అవశేషాలపై నిర్మించి ఆవిష్కరించ బడినవే 'శారీరక స్థూపాలు'. కృష్ణా జిల్లా ఘంటసాల లోనూ, తెలుగువారికి గర్వకారణమైన అమరావతిలోనూ 'శారీరక స్థూపాలు' ఉన్నాయి. ఇక ప్రత్యేక సందర్భాలో నిర్మించబడిన స్థూపాలు 'ఉద్దేశిక స్థూపాలు'. నంద లూరులోనివి ఉద్దేశిక స్థూపాలు కావడం కడప జిల్లాకు గర్వకారణం.

8వ బౌద్ధ మహా సమ్మేళనం ఫిబ్రవరి 9, 10, 11 తేదీలలో తిరుపతి, తనపల్లి రోడ్డులోని డాక్టర్ డి. రామానాయుడు కళ్యాణ మండపంలో జరుగుతుంది.

- బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా,
ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ

సకలం బంద్

(మొదటిపేజీ తరువాయి)





కూడా తమ ఎంపీలకు సంఘీభావంగా నిరసన ప్రదర్శనలు చేయడంతో సమైక్యాంధ్ర కోసం జరిగిన ఉద్యమాల తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో భారీ ఎత్తున పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్రమంతా 'బంద్' అయ్యింది. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఈ బంద్‌లో పాల్గొని దీన్ని సంపూర్ణంగా విజయవంతం చేశారు. రాష్ట్ర విభజన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చేస్తున్న అన్యాయాలకు తోడు.. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో కూడా కేటాయింపులు సరిగా లేకపోవడాన్ని నిరసిస్తూ గురువారం అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలు, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలు బంద్‌లో పాల్గొని ఆందోళనలు చేపట్టాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ కర్ఫ్యూ వాతావరణం కనబడింది. ముందుజాగ్రత్త చర్యగా ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాల, పాఠశాలలకు శెలవు ప్రకటించింది. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన పోలీసులు కూడా బంద్ సందర్భంగా విజయవాడలో విధి నిర్వహణ చేయడం విశేషం.

దద్దరిల్లిన బెజవాడ

బంద్ సందర్భంగా విజయవాడ నగరం దద్దరిల్లింది. ప్రత్యేకహోదా సమితి ఆధ్వర్యంలో వామపక్షాలు, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలు విజయవాడ వ్యాప్తంగా బంద్‌లో పాల్గొన్నాయి. ఉదయం ఆరుగంటలకే విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు చేరుకున్న ఉద్యమకారులు బస్టాండ్ ఎదుట బైఠాయించి, నిరసన చేపట్టారు. ఒక్క బస్సును కూడా డిపో నుంచి బయటకు పంపలేదు. కృష్ణాజిల్లా వ్యాప్తంగానూ బస్ డిపోల ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లాలోని 14 డిపోల దాదాపు 1400 బస్సులు డిపోదాటి బయటకు పోలేదు. విజయవాడలోని లెనిన్ సెంటర్ లోని ధర్నాచౌక్ వద్ద చేపట్టిన ఆందోళనలో ప్రముఖ సినీ విమర్శకుడు, నటుడు కత్తి మహేష్ పాల్గొని టీడీపీ, బీజేపీలపై మండిపడ్డారు. టీడీపీ అసమర్థ వైఖరి వల్లే బడ్జెట్‌లో కేంద్రం తెలుగు ప్రజలను మోసం చేసిందని తెలిపారు. ఏపీ ప్రయోజనాలు కాపాడేందుకు సినీ పరిశ్రమ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వచ్చి పోరాటం చేయాలని, ఆయనతోపాటు ఉద్యమంలోకి తానూ వస్తానని చెప్పారు.

కేంద్ర, రాష్ట్రాల నాటకం: వైఎస్ జగన్

ప్రధాన ప్రతిపక్షం వైఎస్ఆర్‌సీపీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి నిరసనలు, రాస్తారోకోలు చేయడంతో పాటు ప్లకార్డులు ప్రదర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజల ముందు ఎండగట్టింది. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా నెల్లూరు జిల్లాలో ఉన్న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సైతం బంద్‌కు సంఘీభావంగా గురువారం పాదయాత్రకు విరామం ఇచ్చి.. పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలు ఆడుతూ ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆయన మండిపడ్డారు. పార్టీ ఎంపీలతో పార్లమెంటులో రోజుకోవిధంగా మాట్లాడిస్తున్నారని దుయ్యబట్టారు. విజయవాడ బీసెంట్‌రోడ్డులో మాజీమంత్రి పార్థసారథి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఏలూరు రోడ్డులో రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీను, సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇక గుంటూరులో పార్టీ నేతలు అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఓటుకు నోటు స్కాంలో ఇరుక్కుపోవడం వల్లే చంద్రబాబు రాష్ట్రాన్ని కేంద్రం ముందు తాకట్టు పెట్టారని వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయనగరంలో కార్యకర్తలతో కలిసి ఆయన ధర్నాలో పాల్గొన్నారు. బంద్‌లో పాల్గొన్న ప్రజలందరికీ మాజీమంత్రి కొలుసు పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రానికి ఇచ్చింది 'గుండు'సున్నా

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చేస్తున్న ద్రోహానికి నిరసనగా పెనమలూరు టీడీపీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శిరోముండనం చేయించుకున్నారు. ఉయ్యూరు సెంటర్‌లో నడిరోడ్డుపై గుండు చేయించుకుని నిరసన తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ తలుపులను మూసి రాష్ట్ర విభజన చేసిందని, ఇప్పుడు మూడేళ్లుగా బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చింది గుండు సున్నా అన్ని అగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మంత్రులు కూడా ఆందోళనల్లో పాల్గొన్నారు. విశాఖలో మంత్రి గంటా శ్రీనివాసరావు నిరసనలో పాల్గొన్నారు. తాము ఎంపీల పోరాటానికి మద్దతుగా నిరసన తెలుపుతున్నా మన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే బీజేపీతో పొత్తును వదులుకునేందుకు సిద్ధమని ప్రకటించారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రజలు భావిస్తున్నారని హోంమంత్రి చినరాజప్ప అన్నారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లో నిరాహార దీక్ష చేస్తున్న టీడీపీ శ్రేణులకు మంత్రి పి.నారాయణ సంఘీభావం ప్రకటించారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లో మంత్రి నక్కా ఆనంద్ బాబు ఆందోళనల్లో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాలో మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యే దామచర్ల నిరసనల్లో పాల్గొన్నారు. తెలుగు మహిళలు మోకాళ్ల నడకతో నిరసనను తెలియజేశారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, వివిధ పక్షాల నేతలూ ఆందోళనల్లో పాల్గొన్నారు. విజయవాడలో ఏపీయుడబ్ల్యుజే, ఐజేయు ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్‌లోనూ ఏపీ బంద్‌కు మద్దతుగా హైకోర్టు ఎదుట ఏపీ న్యాయవాదులు ఆందోళన చేపట్టారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీలు

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీలు, నిరసనలు చేపట్టాయి. అనంతపురంలో ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తల బైక్ ర్యాలీ, వామపక్షాల ఆందోళనలో పాల్గొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని వారు చరిత్రహీనులుగా మిగులుతారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మోదీ అంటే భయంతోనే చంద్రబాబు హోదా అడగటం లేదన్నారు. అనంతపురంలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్ నిరసనల్లో పాల్గొన్నారు. శ్రీకాకుళంలో కేంద్ర మాజీమంత్రి కిల్లి కపారాణిని పోలీసులు గృహనిర్బంధం చేశారు.

పోలీసుల పటిష్ఠ బందోబస్తు

రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛందంగా చేపట్టిన బంద్‌లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. అన్ని జిల్లాలు, ప్రత్యేక కూడళ్లు, సెంటర్లలో భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లాల ఎస్పీలకు ముందే సమాచారం అందించి, గట్టిచర్యలు తీసుకోవాలని హోంశాఖ ఆదేశాల్చింది. విజయవాడలో తెలంగాణ యూసఫ్‌గూడకు చెందిన ఆరో బెటాలియన్ నుంచి వచ్చిన 150 మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. పలువురిని ముందస్తుగా గృహనిర్బంధం చేశారు.

జేఏసీకి జేపీ సై

(మొదటిపేజీ తరువాయి)

జయప్రకాశ్ నారాయణ సుముఖత వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారం కోసం కేంద్రంతో పోరాటంలో పవన్‌తో కలిసి ముందుకు సాగేందుకు సిద్ధమేనని ప్రకటించారు. బుధవారం మీడియా సమావేశంలో జేఏసీ ప్రతిపాదన చేసిన పవన్ గురువారం జేపీ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. జేఏసీ ఏర్పాటు, తెలుగు రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై చర్చించారు. అనంతరం వారిరువురూ కలిసి మీడయాతో మాట్లాడారు. జేఏసీ ఏర్పాటు విధివిధానాలపై దిశానిర్దేశం చేయాల్సిందిగా జేపీని కోరానని, అందుకు ఆయన సమ్మతించారని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఇరు తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చిన హామీలు అమలయ్యేలా కేంద్రంపై పోరాడేందుకు మరింత మందిని కలుపుకొని ముందుకుపోతామని చెప్పారు. త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణపై చర్చిస్తామన్నారు. ఆ తర్వాత జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. జేఏసీ ఏర్పాటుకు, విభజన హామీల సాధనకు తన మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రజల కోసం పవన్ కోరి కష్టాలు తెచ్చుకుంటున్నారని, ప్రజలకు సేవ చేసేందుకు ఆయన తపిస్తున్నారని జేపీ కొనియాడారు. తెలుగు రాష్ట్రాలపై కేంద్రం శీతకన్ను వేసిందని, విభజన హామీలను అమలు చేయకపోవడమంటే ఏరు దాటాక తెప్ప తగిలేయడమేనని విమర్శించారు. పన్ను రాయితీల విషయంలోనూ ఏపీని కేంద్రం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక వివిధ రాష్ట్రాలకు రూ.27 వేల కోట్ల రాయితీలు ఇచ్చిందని ఆయన చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా, తెలంగాణకు ఎయిమ్స్ తదితర హామీలను విభజన చట్టంలో పొందుపరిచారని, మోదీ, రాజ్‌నాథ్‌సింగ్ మౌఖికంగా కూడా పలు హామీలు ఇచ్చారని జేపీ గుర్తుచేశారు. వాటన్నింటినీ సాధించేందుకు జేఏసీ పోరాడుతుందన్నారు.

రేణుకా చౌదరికి 'పొగరు'!

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల నాయకుల మీద ఉత్తరాది నాయకులు అహంకారపూరితంగా పలు రకాల వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో సీనియర్ పార్లమెంటేరియన్ అయిన రేణుకాచౌదరిపై కాంగ్రెస్ పార్టీకే చెందిన నాయకుడు తెహసీన్ పూనావాలా అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. రేణుకాచౌదరికి పొగరు ఎక్కువైందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటులో ప్రసంగిస్తున్న సమయంలో ఆమె నవ్వడంతో పూనావాలా ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభలో ఆమె నవ్వు తనను చాలా అసౌకర్యానికి గురిచేసిందంటూ ట్విట్టర్‌లో కామెంట్ చేశారు. ''కాంగ్రెస్ పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడైన మద్దతుదారుడిగా నేను చెప్పదలచుకున్నది ఒకటే.. ఈ రేణుకాచౌదరిలు, మణిశంకర్ అయ్యర్‌లు పార్టీకి పెనుభారంగా పరిణమించారు. వాళ్ల పొగరుకు కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇది గాంధీ, నెహ్రూ లాంటి అనేకమంది మహానుభావులున్న పార్టీ. రాజ్యసభలో ఆమెనవ్వు నన్ను తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది'' అని పూనావాలా తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధార్ గురించి తన ప్రసంగంలో ప్రస్తావించినపుడు రేణుకాచౌదరి గట్టిగా నవ్వారు. ఆ సమయంలో మోదీ కూడా వివాదాస్పద వ్యాఖ్యలే చేశారు. ''చైర్మన్ గారూ, రేణుకాజీని మీరు ఏమీ అనొద్దని కోరుకుంటున్నాను. రామాయణం సీరియల్ తర్వాత ఈ తరహా నవ్వు వినగలిగే సౌభాగ్యం మనకు కలిగింది'' అని ఆయన అన్నారు. అంటే పరోక్షంగా శూర్పణక నవ్వును మోదీ ప్రస్తావించినట్లయింది. ఆ సమయంలో అధ్యక్ష స్థానంలో ఉన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కూడా రేణుకాచౌదరిని పేరుపెట్టి ప్రస్తావిస్తూ, మీ ప్రవర్తన బాగోలేదని హెచ్చరించారు.

అయితే ఈ వ్యాఖ్యల పట్ల ఆ తర్వాత మీడియాతో స్పందించిన రేణుకాచౌదరి.. తాను మోదీ వ్యాఖ్యల గురించి ఏమీ అనదలచుకోలేదని చెప్పారు. ఆయన ఒక మహిళ స్థాయిని కించపరిచేలా మాట్లాడారన్నారు. తాను ఆయన స్థాయికి దిగజారి సమాధానం ఇవ్వలేనని ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ కూడా మోదీ వ్యాఖ్యల పట్ల ఘాటుగానే స్పందించింది. పార్టీ అధికారిక ట్విట్టర్ ఖాతా నుంచి ట్వీట్ చేసింది. ''పార్లమెంటులో కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పట్ల ప్రధాని మోదీ అవమానకర వ్యాఖ్యలను మేం ఖండిస్తున్నాం. రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడు కూడా పక్షపాత ధోరణితో వ్యవహరించకూడదని, సహచర సభ్యురాలి గౌరవాన్ని కాపాడాలని కోరుతున్నాం'' అని ఆ ట్వీట్‌లో ఉంది. దానికి మోదీ యాంటీ ఉమన్ అనే హ్యాష్ ట్యాగ్‌ను కూడా జోడించారు.

కార్పొరేట్ కక్కుర్తి

(మొదటిపేజీ తరువాయి)

కొంతమందికి వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులనూ వదలిపెట్టడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ అదృశ్యమైపోయింది. కార్పొరేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు రూ. 4700 చొప్పున రావాల్సిన రీయింబర్స్‌మెంట్ ఆయా కళాశాలల ఖాతాల్లో జమైపోయింది. విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ముక్కుపిండి వసూలు చేసిన పలు కార్పొరేట్ కళాశాలలు ఇప్పుడు రీయింబర్స్‌మెంట్‌గా వచ్చిన మొత్తాన్ని కూడా నొక్కేయడంతో విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు. నారాయణ, శ్రీ చైతన్య, శ్రీ గాయత్రి, ఎన్ఆర్ఐ లాంటి కార్పొరేట్ కాలేజీలు తమకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అక్రమంగా ప్రభుత్వం నుంచి వసూలు చేసి తమకు ఇవ్వడం లేదంటూ జనజాగరణ సమితి పేరిట విశాఖలో విద్యార్థులు ఉద్యమాన్ని ప్రారంభించారు. సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే రీయింబర్స్‌మెంట్ మొత్తం మంజూరైందని, ఖాతాల్లో జమ కూడా అయ్యిందని అధికారులు చెబుతుండగా, కార్పొరేట్ కళాశాలలు మాత్రం దీనిపై నోరు విప్పడం లేదు. కొందరు సాంకేతిక లోపం అంటూ తప్పించుకొంటుంటే మరికొందరు ఆ డబ్బుతో మీకు సంబంధం లేదని చెబుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ద్వారా ఆయా కేటగిరీల విద్యార్థులకు ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము మంజూరు అవుతుంది. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఆయా విద్యార్థుల నుంచి దరఖాస్తులు తీసుకొని ఆ మొత్తాన్ని తమ ఖాతాల్లో జమ వేసుకొంటున్నాయి. విద్యార్థులు చెల్లించాల్సిన మొత్తం ఫీజులో రూ. 4700 రూపాయలను మినహాయించాల్సి ఉండగా అదేమీ లేకుండా మొత్తం ఫీజు తీసేసుకుంటున్నారు. ఎవరైనా అడిగితే రీయింబర్స్‌మెంట్ మొత్తం ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదని చెప్పి పంపిచేస్తున్నారు. వీటిపై వివరాలు సేకరించిన జన జాగరణ సమితి సభ్యులు విశాఖలో ఆధారాలతో ఆందోళనకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ దందా జరుగుతోందని , 90 శాతం మంది విద్యార్థులకు దీనిపై అవగాహన లేకపోవడమే కార్పొరేట్ కళాశాలకు వరంగా మారిందని జాగరణ సమితిరాష్ట్ర కార్యదర్శి కె. నరేంద్ర అన్నారు. పలువురు కార్పొరేట్ కళాశాల విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో అక్రమాలపై దృష్టి సారించామని, ఈ స్కాం కోట్లలోనే జరిగిందని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించి ఇంటర్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కుంభకోణంపై విచారణ జరిపించాలని ఆయన డిమాండు చేశారు. విద్యార్థులకు రావాల్సిన మొత్తాలను కార్పొరేట్ కళాశాలల నుంచి ఇవప్పించాలని లేని పక్షంలో వేలాది మంది విద్యార్థులతో అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నారాయణ కళాశాల యజమాని నారాయణ మంత్రి గా ఉండటం, ఆయన వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు విద్యాశాఖామంత్రిగా ఉండటంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులకు న్యాయం జరగడం లేదని సమితి జిల్లా అధ్యక్షుడు గేదల స్వరూప్ ఆరోపించారు. గుర్తింపు పొందిన విద్యార్థి సంఘాలతో ఏమాత్రం సంబంధం లేకుండా వందలాది మంది విద్యార్థులు జగజాగరణ సమితి పేరట రోడ్డెక్కడం సంచలనం సృష్టించింది. ఈ సంఘటనతో మిగిలిన విద్యార్థి సంఘాలు ఈ వ్యవహారంపై దృష్టిసారించాయి.

రాహుల్ నాక్కూడా బాసే

(మొదటిపేజీ తరువాయి)

అధినేత్రిగా ఉన్న సోనియాగాంధీ.. ప్రస్తుతం ఆ పదవిలో లేరు. ఆ స్థానాన్ని ఆమె కుమారుడు రాహుల్ గాంధీ అధిష్ఠించిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాహుల్ తనకు కూడా 'బాస్' అనే విషయంలో అనుమానం ఏమీ అక్కర్లేదని స్వయంగా సోనియాగాంధీయే చెబుతున్నారు. అందరి తరఫున కొత్త అధ్యక్షుడికి తాను శుభాకాంక్షలు చెబుతున్నానని, అతడు తనకు కూడా బాసేనని అన్నారు. అందులో ఎవరికీ ఎలాంటి అనుమానం అక్కర్లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం నేపథ్యంలో విలేకరులతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'కనిష్ఠ పాలన, గరిష్ఠ ప్రచారం'.. ఇంకా 'కనిష్ఠ పని, గరిష్ఠ మార్కెటింగ్' చేస్తోందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యంలోని వివిధ సంస్థలమీద ఒక పద్ధతి ప్రకారం దాడి జరుగుతోందని, నిఘా సంస్థలను రాజకీయ ప్రత్యర్థుల మీద దాడులకు ఆయుధాలుగా ప్రభుత్వం వాడుకుంటోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతోందని, ఈ మధ్య కాలంలో పార్లమెంటు, న్యాయవ్యవస్థ, మీడియా, పౌరసమాజం అన్నింటిమీదా పద్ధతి ప్రకారం దాడి జరుగుతోందని సోనియా అన్నారు. మైనారిటీలు, దళితుల మీద దాడులు చేయడం ద్వారా కుత్సిత రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారన్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు, రాజస్థాన్ ఉప ఎన్నికలలో పార్టీ పనితీరుపై ఆమె అభినందనలు కురిపించారు. గుజరాత్‌లో అత్యంత క్లిష్ట పరిస్థితుల నడుమ చాలా బాగా పనిచేశారని, అలాగే రాజస్థాన్‌లో కూడా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. దీన్ని బట్టి చూస్తే గాలి మళ్లీ తమవైపు వీస్తోందని, కర్ణాటక కూడా మళ్లీ కాంగ్రెస్ పాలనలోనే ఉంటుందన్న నమ్మకం తనకుందని సోనియాగాంధీ అన్నారు. 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ నాయకులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 2014 ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ అనడంలో అనుమానం లేదని, కానీ అది అసాధారణ పరిస్థితి అని ఆమె అన్నారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారం చేయడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వసనీయత, సానుకూల వాతావరణం కలిగేలా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

రాఫెల్ డీల్‌ను ఆమె కూడా గుర్తుచేశారు. అతిపెద్ద రక్షణ ఒప్పందం కొనుగోలు ధరపై ఎందుకంత గోప్యత పాటిస్తున్నారని ప్రశ్నించారు. పైగా కల్పిత వాదనలతో సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్థికాంశాలు, ఉపాధి కల్పనపైనా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కొత్త ఉద్యోగాలివ్వకపోగా, ఉన్నవీ ఊడగొడుతున్నారని విమర్శించారు. కొత్త పెట్టుబడులు రానిదే ఉద్యోగాలు రావని, నాలుగేళ్లలో పెట్టుబడుల రాక గణనీయంగా పడిపోయిందన్నది వాస్తవమని సోనియా అన్నారు.

నిరసన సెగ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంగణంలోనూ నిరసన గళం వినిపించారు. టీడీపీ ఎంపీ శివప్రసాద్ కాళ్లకు గజ్జెలు కట్టుకుని, డప్పు మోగిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. లోక్‌సభ ప్రారంభం కాగానే టీడీపీ ఎంపీలు విభజన హామీల అమలు డిమాండ్‌తో వెల్‌లోకి దూసుకెళ్లారు. రైల్వే జోన్ గురించి కూడా ప్రశ్నించారు. 'గోవిందా గోవిందా' అంటూ నినదించారు. ఏపీపె ఆర్థిక మంత్రి జైట్లీ మాట్లాడతారని మంత్రి అనంతకుమార్ చెప్పినా వారు శాంతించలేదు. సభలో డప్పు వాయించవద్దని స్పీకర్ సుమిత్రా మహాజన్ సూచిస్తూ ఎంపీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మీ నినాదాలు ఇతర సభ్యులకు ఇబ్బందికరం. క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవు'' అని హెచ్చరించారు. పార్లమెంట్ ముందు వైసీపీ ఎంపీలు ప్లకార్డులు చేతబట్టి ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని నినదించారు. రాజ్యసభలోనూ ఏపీ ఎంపీలు నిరసన తెలిపారు. విభజన హామీల అమలుపై 15రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని కేంద్రమంత్రి సుజనాచౌదరి డిమాండ్ చేశారు. ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం, అమరావతి నిధులపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు సూచించారు.

ఏపీ ఎంపీల ఆందోళనలో నిజముంది: కవిత

ఏపీ ఎంపీల ఆందోళనలో నిజముందని, పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీఆర్ఎస్ ఎంపీ కవిత లోక్‌సభలో డిమాండ్‌చేశారు. విభజన చట్టంలో తెలంగాణ, ఏపీలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. టీడీపీ, వైసీపీ సోదరుల నిరసనకు మద్దతిస్తున్నానని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వ చివరి బడ్జెట్‌పై రైతాంగం ఎన్నో ఆశలు పెట్టుకున్నా వారికిచ్చిందేమీ లేదని ఎద్దేవాచేశారు. ఇక

వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సమావేశమయ్యారు. విభజన చట్టం హామీల అమలులో వైఫల్యాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

ఏపీలో భారీ రైస్‌మిల్లు

(మొదటిపేజీ తరువాయి)



వాణిజ్య, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. వారిలో కొందరు అందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. పర్యటనలో చంద్రబాబు ముందుగా ఫీనిక్స్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గౌరవ్ థావన్, గ్రూపు ఫైనాన్స్ కంట్రోలర్ నితిన్ నావన్ ధీర్‌లతో సమావేశమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ప్రపంచంలోనే అతిపెద్దదైన మెగా ఇంటిగ్రేటెడ్ రైస్ మిల్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని, ఇందుకు సంబంధించి పనులు ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెడతామని వాళ్లు తెలిపారు. ఈ రైస్ మిల్ ప్రాజెక్టు ఏడాదికి 3 లక్షల టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుంది. అనంతపురం జిల్లాలో పెద్దఎత్తున వేరుశనగ సాగు చేపట్టేందుకు గల అవకాశాలు పరిశీలించాలని, వేరుశనగ నుంచి బటర్ తయారు చేసే యూనిట్ నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు.

అనంతరం ముఖ్యమంత్రి షరాఫ్ గ్రూపుతో సమావేశమయ్యారు. ఆహార శుద్ధి రంగంలో భారత ప్రభుత్వం సరైన విధానం ప్రకటిస్తే ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ నెలకొల్పే అంశంపై గతంలోనే ప్రతిపాదనలు ఇచ్చామని, ప్రస్తుతం యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన భూసేకరణకు ఎదురుచూస్తున్నామని చెప్పారు. లాజిస్టిక్స్ వ్యవహారాలలో ప్రభుత్వ విధానం తమకు అంత సానుకూలంగా లేదని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, ఈ రంగంలో అత్యుత్తమ విధానం కోసం ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి బదులిచ్చారు. ఎలాంటి అనుమతులైనా సత్వరం ఇవ్వడంలో తమ ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు. త్వరలో తమ సంస్థ అత్యున్నతస్థాయి బందాన్ని ఏపీకి పంపిస్తామని షరాఫ్ గ్రూపు వైస్ చైర్మన్ షరాఫుద్దీన్ మొహమ్మద్ హుస్సేన్ షరాఫ్ ముఖ్యమంత్రికి తెలిపారు.


ఆ తర్వాత ఎమిరేట్స్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎమిరేట్స్, దుబాయ్ నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (డినాటా) చైర్మన్ షేక్ అహ్మద్ బీన్ సయీద్ అల్ మక్తూమ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో యుఏఈలో భారత రాయబారి నవ్‌దీప్ సూరి కూడా పాల్గొన్నారు. త్వరలోనే ఏపీ, అమరావతికి తమ సర్వీసులను ఆరంభించడానికి ఎమిరేట్స్ సన్నాహాలు చేస్తోందని.. అయితే అందుకు భారత ప్రభుత్వ నియమ నిబంధనలు కొంత అడ్డంకిగా ఉన్నాయని మక్తూమ్ అభిప్రాయపడ్డారు. ఈ నిబంధనలు సడలిస్తే వెంటనే తమ సర్వీసులను నడుపుతామన్నారు. భారత్ నుంచి దుబాయ్ రావడానికి ఇప్పుడు కేటాయిస్తున్న సీట్ల సంఖ్య పరిమితంగా ఉందని, పాత అగ్రిమెంటును భారత ప్రభుత్వం సవరించాలని ఆయన సూచించారు. అమరావతిని సందర్శించాలని మక్తూమ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. ఏపీలో విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణలో భాగస్వామ్యం తీసుకునే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎయిర్‌లైన్స్ విజయవంతం కావడానికి ఒక మంచి పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని షేక్ మక్తూమ్ తెలిపారు. విమానాలు పర్యాటకులను తీసుకెళ్లినా, అక్కడ వారి కార్యకలాపాలకు తగిన ఏర్పాట్లు కూడా అవసరమని, ముఖ్యంగా తగిన వసతి, షాపింగ్ మాల్స్, సమావేశ మందిరాలు అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా ఎమిరేట్స్ గ్రూపుతో ఏపీ ఆర్థిక అభివృద్ధి మండలి ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం ఉభయులు కలిసి వర్కింగ్‌గ్రూపులను ఏర్పాటు చేసుకుంటారు. ఒప్పందం ప్రకారం ఏపీలో మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎమ్ఆర్ఆర్) సదుపాయాన్ని ఏర్పాటుచేస్తారు. ఏవియేషన్ శిక్షణ కోసం ఒక అకాడమీని కూడా నెలకొల్పుతారు. ఎయిర్ క్రాఫ్ట్స్ తయారీ, విమానాల ఇంటీరియర్, డ్యూరబుల్స్ తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తారు. ఈ ఒప్పందం వాస్తవరూపం దాల్చితే రూ.30 వేల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయి.

అనంతరం డీపీ వరల్డ్ గ్రూప్ చైర్మన్ సుల్తాన్ బీన్ సులేయమ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు.

సమావేశంలో గ్రూపు డిప్యూటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాజ్ జిత్ సింగ్ వాలియా, కార్పొరేట్ ఫైనాన్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ ఖన్నా పాల్గొన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు, వివిధ అంశాలలో కలిసి పనిచేసేందుకు ముఖ్యమంత్రి గత పర్యటనలోనే డీపీ వరల్డ్ సంసిద్ధత వ్యక్తం చేయడంతో అందుకు సంబంధించిన సంయుక్త కార్యబృందాన్ని ఏర్పాటుచేశారు.

అందులో ఏపీ ప్రభుత్వ మౌలిక సదుపాయాల శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, డీపీవరల్డ్ సీఈవో యువరాజ్ ఉంటారు. ఇక ఓడరేవులకు వస్తువులను సరఫరా చేసేందుకు భారత్ నౌకాశ్రయాలు ఎదుర్కొంటున్న ప్రధాన అడ్డంకులను తొలగించాలని చైర్మన్ సుల్తాన్ బీన్ సులేయమ్ సూచించారు. ఏపీలో తమ సంస్థ కార్యకలాపాల విస్త తికి ఒక బందాన్ని పంపించేందుకు సుల్తాన్ అంగీకరించారు. ముఖ్యమంత్రి బందంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ముఖ్యకార్యదర్శి జి. సాయిప్రసాద్, మౌలిక వసతుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిషోర్ తదితరులున్నారు.

‘2.0’ కంటే ముందే...


● రజినీకాంత్

రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న భారీ టెక్నికల్ మూవీ ‘2.0’. ఈ చిత్రంలో ఎమీ జాక్సన్ హీరోయిన్‌గా నటిస్తుండగా బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ విలన్‌గా కనిపిస్తారు. మొదట ఈ చిత్రాన్ని జనవరి 25న విడుదల చెయ్యాలని ప్లాన్ చేశారు. కానీ, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి కాకపోవడం వల్ల ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చెయ్యాలనుకున్నారు. కానీ, ఏప్రిల్‌లో కూడా ఈ సినిమాని రిలీజ్ చెయ్యలేకపోతున్నారని తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు రజనీకాంత్ హీరోగా పా.రంజిత్ రూపొందించిన ‘కాలా’ ముందుగా రిలీజ్ అవుతుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటుంది. ఈ చిత్రంలో రజనీకాంత్ ఓ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తారు. ‘2.0’ రిలీజ్ వాయిదా పడిన విషయం, ‘కాలా’ ముందుగానే విడుదలవుతున్న విషయం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

మా మధ్య పోటీ లేదు
– సాయిధరమ్ తేజ్

‘చిరంజీవిగారి కమ్‌బ్యాక్ సినిమాను డైరెక్ట్ చేసిన వినాయక్‌గారితో నా సినిమా అనగానే చాలా హ్యాపీగా అనిపించింది. వినాయక్‌గారు సెట్‌లోని నటీనటులను కంఫర్ట్ జోన్‌లో ఉంచుతారు’ అని అంటున్నారు హీరో సాయిధరమ్ తేజ్. ఈయన కథానాయకుడిగా నటించిన చిత్రం ‘ఇంటిలిజెంట్’. సి.కల్యాణ్ నిర్మాత. వి.వి.వినాయక్ దర్శకుడు. ఈసినిమా ఫిబ్రవరి 9న విడుదలవుతుంది. ఈ సందర్భంగా హీరో సాయిధరవమ్ తేజ్ సినిమా గురించిన విశేషాలను పాత్రికేయలకు తెలియజేశారు...

‘ఇంటిలిజెంట్’లో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

– మనకి ఎవరైనా సపోర్ట్ చేస్తే వారిని మనం మరచిపోకూడదు. వారికి ఏదైనా కష్టం వస్తే వారికి మనం సపోర్ట్‌గా నిలబడాలనే అండర్‌లైన్ మెసేజ్ ‘ఇంటిలిజెంట్’ సినిమాలో ఉంటుంది. దీన్ని బట్టి కథ రన్ అవుతుంది. హీరో క్యారెక్టరైజేషన్‌ను అనుసరించే టైటిల్‌ను నిర్ణయించారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యువకుడి పాత్రలో నటించాను. చిన్నప్పట్నుంచి తన కంఫర్ట్ జోన్ నుండి బయటకు రాని యువకుడు, కొన్ని పరిస్థితులు కారణంగా ఆ కంఫర్ట్ జోన్ నుండి బయటకు రావాల్సి వస్తుంది. అలా వచ్చిన యువకుడు ఎంత ఇంటిలిజెంట్‌గా ప్రవర్తించాడనేదే సినిమా. కొత్త క్యారెక్టర్ చేశానని చెప్పను కానీ ఇది నేను నటించిన పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్. నాకైతే చేస్తున్నప్పుడు కొత్తగా అనిపించింది. సినిమా చూసే ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. ప్రతి సినిమాను సక్సెస్ కావాలనే ఉద్దేశంతోనే చేస్తాం. అందులో మన వంతు ప్రయత్నం తప్పకుండా ఉంటుంది. ఇక జయాపజయాలు మన చేతిలో ఉండవు కదా.. ప్రేక్షకుల చేతిలో ఉంటుంది.

కథ నచ్చి ఈ సినిమా చేశారా? లేక వినాయక్ డైరెక్టర్ కాబట్టి ఒప్పుకున్నారా?

– వినాయక్‌గారి దర్శకత్వంలో సినిమా అనగానే ఒప్పుకున్నాను. అయితే ప్రతి సినిమాకు కథ కూడా ముఖ్యమే. కాబట్టి నేనైనా, వినాయక్‌గారైనా మంచి కథ ఉండాలనే చూస్తారు. ఆకుల శివగారు చాలా మంచి కథను అందించారు. కథ లేకుండా కాంబినేషన్‌పై సినిమా చూడాలంటే కష్టం. శివగారు అందించిన కథను వినాయక్‌గారు రాసిన స్క్రీన్‌ప్లే, టేకింగ్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. నేను విభిన్నమైన కథల కోసం వెయిట్ చేస్తున్నాను. అయితే ఎక్కువగా కమర్షియల్ ఫార్మేట్ సినిమాలే వస్తున్నాయి. అందులో నచ్చిన కథలతోనే ముందుకు వెళుతున్నాను. ఓ పంథాలో వెళ్లాలని ముందు నుండి అనుకోవడం లేదు. నాకు నచ్చిన.. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటూ వెళుతున్నాను.

వరుణ్‌తేజ్ సినిమా కూడా మీ సినిమాతో పాటు విడుదలవుతుందిగా.. పోటీగా భావిస్తున్నారా?

– ‘ఇంటిలిజెంట్’, ‘తొలిప్రేమ’ సినిమాల రిలీజ్ డేట్స్ విషయం అనేది నిర్మాతల వ్యవహారం. నేను వారి పరిధుల్లోకి వెళ్లి వారిని పుష్ చేయలేను. అలాగే మా సినిమా నిర్మాత కూడా ముందుగానే రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేసేశారు. వేరే చాయిస్ లేకపోవడంతో అనౌన్స్ చేసిన రోజునే ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. నేను, వరుణ్ చేయాల్సిన సపోర్ట్ చేశాం. మా మధ్య ఏ పోటీ లేదు. అయితే ఒకే రోజు ఇద్దరి సినిమాలు విడుదలై హిట్ కొడితే.. ఆ కిక్ వేరేలా ఉంటుందని నాకు అనిపించింది. అయితే తొలిప్రేమ అనౌన్స్ చేసిన రోజు కంటే ఓ రోజు ఆలస్యంగా వస్తున్నారంతే.



సినిమాలో మీరు ఎంత వరకు ఇన్‌వాల్వ్ అవుతారు?

– కథేంటి.. నా క్యారెక్టర్ ఏంటి? అనే విషయాలను బాగా పట్టించుకుంటాను. అంతే కానీ హీరోయిన్, ఇతర ఆర్టిస్టులు సహా సినిమాలో ఇన్‌వాల్వ్ కాను. డైరెక్టర్స్ అన్నాక కొత్త కాంబినేషన్స్, హిట్ కాంబినేషన్స్‌లో సినిమాలు చేయాలని కోరుకుంటారు. దర్శక నిర్మాతలను అనుసరించే వెళతాను.

బాలకృష్ణ, ప్రభాస్ అందించిన సహకారంపై మీ స్పందనేంటి?

– మా సినిమా టీజర్‌ను నందమూరి బాలకృష్ణగారు విడుదల చేశారు. అలాగే తొలిపాటను ప్రభాస్ అన్న.. రిలీజ్ చేశారు. మా సినిమా విడుదల సందర్భంగా వారికి నా స్పెషల్ థాంక్స్. వాళ్లు అంత పెద్ద స్టార్స్ అయినా మాకు సపోర్ట్ అందించారు. ముఖ్యంగా బాలకృష్ణగారు మా మెగాఫ్యాన్స్‌కు రెస్పెక్ట్ ఇచ్చారు. అది చూసి హ్యాపీగా ఫీలయ్యాను. అంత పెద్ద వ్యక్తి అలా చెప్పడం చూసి.. అందరూ ఇలా అందరినీ కలుపుకుపోయేలా ఉండాలనిపించింది. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీకి ‘బాహుబలి’ వంటి హిట్ ఇచ్చిన ప్రభాస్ అన్న.. సాంగ్ రిలీజ్ చేశారు. చాలా బాగా మాట్లాడి మా యూనిట్‌ను ఎంకరేజ్ చేశారు.

నిర్మాత సి.కల్యాణ్ గురించి..?

– నిర్మాత కల్యాణ్‌గారు మేకింగ్ కాంప్రమైజ్ కాలేదు. కానీ అనుకున్న బడ్జెట్‌లోనే సినిమాను పూర్తి చేశాం. ఇక తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. అందుకు తగినట్లుగానే నా బెస్ట్ డాన్స్ పెర్‌ఫార్మెన్స్ ఇవ్వడానికి ప్రయత్నించాను.

మీ మావయ్య సాంగ్స్‌ను మీరే రీమిక్స్ చేస్తున్నారు..?

– పెద్ద మామయ్య(చిరంజీవి) సాంగ్స్ అన్నింటిని నేనే రీమిక్స్ చేయడం లేదు. నేనెప్పుడూ ఆయన సాంగ్స్‌ను రీమిక్స్ చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. అది ఆయా సినిమాల దర్శకుల నిర్ణయం. అయితే అలాంటి రీమిక్స్ చేయాల్సి వచ్చినప్పుడు నా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాను. ప్రేక్షకులను మెప్పించాల్సిన బాధ్యతగా ఫీలై రీమిక్స్ సాంగ్స్ చేశాను.


● రష్మిక మండన్న

విజయ్‌తో మరోసారి

కన్నడలో ‘కిరిక్‌పార్టీ’ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన రష్మిక మండన్న ‘ఛలో’ చిత్రంతో తెలుగు సినిమాల్లో ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రంలో ఆమె పెర్‌ఫార్మెన్స్ అందర్నీ ఆకట్టుకుంది. తెలుగులో తన మొదటి సినిమా విడుదల కాక ముందే విజయ్ దేవరకొండతో నటించే అవకాశం దక్కించుకుంది రష్మిక. పరశురామ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ చేస్తున్న చిత్రంలో రష్మిక హీరోయిన్‌గా నటిస్తోంది. అంతే కాకుండా విజయ్ దేవరకొండతో రెండో సినిమా చేసే ఛాన్స్ కొట్టేసిందీ కన్నడ భామ. ‘పెళ్లిచూపులు’ నిర్మాత యష్ రంగినేని నిర్మిస్తున్న ఓ చిత్రంలో విజయ్ దేవరకొండ హీరో. ఈ చిత్రం ద్వారా భరత్ కమ్మ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కాలేజ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మిక అయితే బాగుంటుందని దర్శకనిర్మాతలు భావిస్తున్నారని తెలుస్తోంది. ఒక సినిమా షూటింగ్ దశలో ఉండగానే అదే హీరోతో రెండో సినిమా చేసే ఛాన్స్ రష్మికకు దక్కినందుకు చాలా హ్యాపీగా ఉందట.

డబ్బింగ్ చెప్పాలనుకున్నా..!

‘‘ఊహలు గుసగుసలాడే’ తర్వాత మరో మంచి ప్రేమకథా చిత్రం చేయలేకపోయాను. ‘తొలిప్రేమ’ సినిమా చేస్తున్నప్పుడు నాకు ఆ ఫీల్ వచ్చింది’ అని అంటుంది రాశీ ఖన్నా. ఈ కథానాయిక నటించిన ‘తొలి ప్రేమ’ ఫిబ్రవరి 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాశిఖన్నా మాట్లాడుతూ ‘‘ఈ చిత్రంలో మూడు గెటప్స్‌లో కనపడతాను. ఒకటి కాలేజీ ఎపిసోడ్. ఆ తర్వాత లండన్ ఎపిసోడ్. అక్కడి నుంచి తిరిగి వచ్చాక మరొక ఎపిసోడ్. ఈ మూడు పాత్రల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సినిమా కోసం బాగానే కష్టపడ్డా. ప్రతి రోజూ గంట జిమ్ చేస్తే ఈ సినిమా కోసం రెండు గంటల పాటు జిమ్ చేశా. వరుణ్, నేను కలిసి 15 రోజులు డైట్ కూడా చేశాం. తను ఎందుకో చెప్పుకోవడం లేదు కానీ యంగ్‌గా కనిపించడానికి తను కూడా చాలా కష్టపడ్డాడు. దర్శకుడు వెంకీ అట్లూరి సినిమా చక్కగా హ్యాండిల్ చేశారు. నా లైఫ్‌లో కూడా తొలిప్రేమ ఉంది. నా 17ఏళ్లప్పుడు నా సీనియర్ నాకు ప్రపోజ్ చేశాడు. ఒక లెటర్, ఒక రోజ్ ఇచ్చాడు. అయితే అదంతా ఇన్‌ఫాక్చువేషన్ అని తెలుసు. తెలుగులో డబ్బింగ్ చెప్పాలని ఉంది. ఈ సినిమాకు కూడా డబ్బింగ్ చెప్పాలనుకున్నాను. అయితే తమిళంలో సినిమా చేస్తుండటం వల్ల కుదరలేదు. తెలుగులో ఓ మంచి ప్రాజెక్ట్ ఇంకో రెండు మూడు రోజుల్లో అనౌన్స్ అవుతుంది. తమిళంలో మూడు సినిమాలు న్నాయి. మలయాళంలో ఆల్రెడీ ఒక సినిమా చేశా. అమ్మో.. మలయాళం భాష చాలా కష్టంగా ఉందండీ. తెలుగు, తమిళ్ కాసింత కలిసినట్టుగా సులభంగానే ఉన్నాయి. మలయాళంలో విలన్ కోసం ఓ పాట కూడా పాడా. చాలా కష్టమనిపించింది.


● రాశిఖన్నా

రోడ్ జర్నీ నేపథ్యంలో...


● తరుణ్‌భాస్కర్

‘పెళ్ళి చూపులు’ మూవీతో దర్శకుడిగా తనేంటో ప్రూవ్ చేసుకున్నారు యువ దర్శకుడు తరుణ్‌భాస్కర్. వెంటనే ఏదో సినిమా చేయాలని కాకుండా కాస్త వ్యవధి తీసుకుని రోడ్ జర్నీ నేపథ్యంలో సినిమా చేస్తున్నారు తరుణ్ భాస్కర్. ప్రముఖ నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మితమవుతోంది. ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న ఈ సినిమాకు ‘ఈ నగరానికి ఏమైంది’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ‘పెళ్ళిచూపులు’ సినిమాకు సంగీతం అందించిన వివేక్ సాగర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను వేసవిలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. రోడ్ జర్నీపై పలు చిత్రాలు విడుదలయ్యాయి. వాటికి భిన్నంగా తరుణ్ భాస్కర్ తన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారట. త్వరలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియనున్నాయి.

ఫిబ్రవరి 16 న ‘సోడా గోలీసోడా’


● నిత్యానరేష్,మానస్

చక్రసీద్ సమర్పణలో ఎస్.బి ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోన్న చిత్రం ‘సోడా గోలీసోడా’. మానస్, నిత్యా నరేశ్, కారుణ్య హీరో హీరోయిన్లు. మల్లూరి హరిబాబు దర్శకుడు. భువనగిరి సత్య సింధూజ నిర్మాత. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఫిబ్రవరి 16న సినిమా విడుదల కాబోతుంది. నిర్మాత భువనగిరి సత్య సింధూజ మాట్లాడుతూ ‘‘పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రమిది. ఈ చిత్రంలో అన్ని వర్గాలను ఆకర్షించే కంటెంట్ ఉంది. కమర్షియల్ విలువలతో.. ఎక్కడా వెనుకాడ కుండా చిత్రాన్ని నిర్మించాం. దర్శకుడు అద్భుతంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. సెన్సార్ నుండి క్లీన్ యు సర్టిఫికెట్ వచ్చింది. ఫిబ్రవరి 16న చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం’’ అన్నారు.

‘మాణిక్యం’ వదిలి.. వజ్రం ధరిద్దాం



- త్రిపుర సీఎం మాణిక్ సర్కార్‌పై మోదీ వ్యాఖ్య
- అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని ప్రసంగం
- పేదలను దోచుకునే సీపీఎంను దింపాలని పిలుపు

గువహటి, ఫిబ్రవరి 8: త్రిపుర శాసనసభ ఎన్నికలలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తొలిసారి బీజేపీ తరపున సోనాముర నియోజకవర్గంలో ప్రచార సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ‘మార్పు తెద్దాం మాతో రండి’ అన్న బీజేపీ నినాదాన్ని ఉటంకించారు. రాష్ట్రంలో 30 ఏళ్లుగా సీపీఎం పాలన సాగుతుండగా అందులో 20 ఏళ్లనుంచీ మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును శ్లేషార్థంలో ప్రయోగిస్తూ- ‘‘ఇప్పటిదాకా మాణిక్యం ధరించాం. ఇక ‘హీరా’ (వజ్రం)కు మారుదాం’’ అని ప్రజలకు పిలుపునిచ్చారు. ‘హైవే, ఐ-వే, రోడ్లు, ఎయిర్-వే’ పదాల్లోని తొలి అక్షరాలను కలిపి ‘హీరా’గా అభివర్ణించారు. తాను పేర్కొన్న మార్పు దిశగా త్రిపురలో ‘వాణిజ్యం, పర్యాటకం, నైపుణ్య శిక్షణ’ పేరిట త్రిముఖ పథకం అమలు చేస్తామని ప్రకటించారు. కాగా, నిజాయితీకి మారుపేరుగానేగాక దేశంలో అత్యంత పేద ముఖ్యమంత్రిగా మాణిక్ సర్కార్ వాసికెక్కారు. నామినేషన్ దాఖలు సందర్భంగా సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఆయనకు ఇల్లు లేదు... కారు లేదు... ఇతరత్రా ఆస్తులు కూడా ఏమీ లేవు. చేతిలో ఉన్న సొమ్ము రూ.1,520... బ్యాంకు ఖాతాలో నగదు రూ.2,410 మాత్రమే. ఇంత పేద సీఎం కాబట్టే ఇప్పటిదాకా ఆయన ఎన్నడూ ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేసే అవసరం రాలేదు. అయితే, ముఖ్యమంత్రి తెల్లచొక్కా కింద నల్ల మచ్చలు కూడా ఉన్నాయంటూ ప్రధాని మోదీ ఆరోపించారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో అధిక వేతనాలు అందుతుండగా అతి తక్కువ వేతనాలతో ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. కేంద్రం ఇస్తున్న నిధులను సవ్యంగా వినియోగించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం పేదలను దోచుకుంటున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ఖర్చుచేస్తున్న సొమ్ములో 80 శాతం కేంద్రం ఇస్తున్నదేనని పేర్కొన్నారు.

బంగ్లా మాజీ ప్రధానికి ఐదేళ్ల జైలు




- ట్రస్టుల పేరుతో సొమ్ము స్వాహా
- ఖాలిదా జియా కుమారుడికి పదేళ్ల జైలు
- మరో ముగ్గురికి కూడా జైలు శిక్షలు
- బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు తీర్పు

ఢాకా, ఫిబ్రవరి 8: బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు బేగం ఖాలిదా జియా (72)కు అవినీతి కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడింది. జియా అనాథల ట్రస్టు కోసం విదేశీ విరాళాలను సేకరించి, రూ. 1.62 కోట్ల మొత్తాన్ని స్వాహా చేశారన్న ఆరోపణలు రుజువు కావడంతో ఢాకాలోని సుప్రీంకోర్టు ఆమెకు ఈ శిక్ష విధించింది. ఇదే కేసులో ఆమె కుమారుడు తారిఖ్ రహమాన్, మరో నలుగురికి పదేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. లంచాలు, అవినీతి కేసులో తనపై విచారణ జరగకుండా ఖాలిదా జియా చేసిన ప్రయత్నాలన్నీ 2014 నవంబరు 30తో విఫలమయ్యాయి. దిగువకోర్టులో విచారణను సవాలు చేస్తూ ఆమె దాఖలు చేసిన ‘లీవ్ టు అప్పీల్’ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఆరోజు తిరస్కరించింది.

బంగ్లాదేశ్‌లోని అవినీతి నిరోధక కమిషన్ (ఏసీసీ) పెట్టిన రెండు కేసులలో ఖాలిదాను నిందితురాలిగా తేలుస్తూ దిగువ కోర్టులో విచారణ కొనసాగించవచ్చని హైకోర్టు కూడా అంతకుముందు 2014 మార్చి 19న ఆదేశాలు జారీచేసింది. జియా అనాథల ట్రస్టు, జియా చారిటబుల్ ట్రస్టు పేరుతో ఆమె నడిపిస్తున్న సంస్థలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని, వాటి పేరుతో భారీగా వచ్చే విరాళాలను 2001-2006 మధ్య తాను అధికారంలో ఉన్న సమయంలో ఆమె వెనకేసుకున్నారని అవినీతి నిరోధక కమిషన్ ఆరోపించింది.

నపుంసకులను చేసి.. ఆడుకున్నాడు!




- డేరా బాబాపై సరికొత్త ఆరోపణలు
- భక్తులను నపుంసకులుగా మార్చిన గుర్మీత్
- తాజా చార్జిషీటులో వెల్లడించిన సీబీఐ

చండీగఢ్, ఫిబ్రవరి 8: నమ్ముకుని వచ్చిన భక్తులను నపుంసకులుగా మార్చి వాళ్ల జీవితాలతో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ఆడుకున్నాడని సీబీఐ తాజాగా పంచకుల కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో పేర్కొంది. భారీ మొత్తంలో భూములు, ఆస్తులు పోగేసుకోడానికి వాళ్లను ఆయుధంగా డేరాబాబా వాడుకున్నాడు. భక్తులను ముందుగా నపుంసకులుగా మార్చిన తర్వాత వాళ్లు పూర్తిగా డేరా మీదే ఆధారపడేవారు. వాళ్ల పేర్లతో పత్రాలు సిద్ధం చేసి, భారీ మొత్తంలో భూములు కొనుగోలు చేసి వాటిని తెలివిగా డేరా పేరు మీదకు మార్చుకునేవారు. ఖాళీ దస్తావేజుల మీద వాళ్ల దగ్గర సంతకాలు తీసుకుని, వాటి సాయంతో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ తీసుకునేవారు. దాని ద్వారా వాళ్ల పేరు మీద ముందుగానే కొనుగోలు చేసిన భూములను డేరాకు బహుమతిగా ఇచ్చినట్లు రిజిస్ట్రేషన్ చేయించేవారు. తద్వారా తమ చేతికి మట్టి అంటకుండానే భారీ మొత్తంలో భూములు డేరా వశమయ్యాయి. ఇదంతా ఆ అమాయక భక్తులకు ఏమీ తెలిసేది కాదు.

ఇలా చాలావరకు నపుంసకులుగా మారిన భక్తుల జీపీఏలను 2000-2001 సంవత్సరాల మధ్య వాడుకుని, వాటి ద్వారా భారీ మొత్తంలో భూములు కొనుగోలు చేసి, ఎవరికీ అనుమానం రాకుండా మళ్లీ 2005 తర్వాత వాటిని డేరా పేరు మీదకు బదలాయించుకునేవారని సీబీఐ తన చార్జిషీటులో పేర్కొంది. ఇలా నపుంసకులుగా మారిన భక్తులు తమ జీవితంలో ఎప్పుడూ వాస్తవ అమ్మకందారులను కలిసిన పాపాన పోలేదని కూడా తేలింది. తమకు డేరా ప్రతినిధుల నుంచి భూమి అమ్మకానికి సంబంధించిన సొమ్ము ముట్టేదని, అంతేతప్ప పత్రాలలో ఉన్నవాళ్లను మాత్రం తామెన్నడూ చూడలేదని భూముల యజమానులు చెప్పారు. ఇలాంటి 17 భూములకు సంబంధించిన లావాదేవీలకు చెందిన పత్రాలను సీబీఐ సంపాదించి, వాటిని కోర్టుకు సమర్పించింది. ఈ వ్యవహారంలో సిర్సా ప్రాంతానికి చెందిన పలువురు రెవెన్యూ అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు, న్యాయవాదులు, రిజిస్ట్రార్లను సీబీఐ తన సాక్షులుగా పేర్కొంది.

హెచ్-1బి వీసా..

15 కంపెనీలపై అనర్హత వేటు!



వాషింగ్టన్, ఫిబ్రవరి 8: ప్రత్యేక నైపుణ్యం గల విదేశీయులకు అమెరికాలో ఉద్యోగం కల్పించే వెసులుబాటును 15 కంపెనీలకు తొలగిస్తూ ఆ దేశ కార్మిక శాఖ ఆదేశాలు జారీచేసింది. ఆ కంపెనీలను అనర్హుల జాబితాలో చేరుస్తూ నోటీసులు జారీ చేసింది. ఇందులోని కంపెనీలకు హెచ్-1బి వీసాలు జారీ చేసే అధికారాన్ని రద్దు చేసినట్లు తెలిపింది. ఈ కంపెనీలను హెచ్-1బి వీసాకు సంబంధించి బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. ఈ జాబితాలో పేర్కొన్న కంపెనీలు ఉద్దేశపూర్వకంగా నిబంధనలను ఉల్లంఘించినట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానిక ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఉద్దేశంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బి వీసాల జారీపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే! ఈ క్రమంలో విదేశీయులను ఉద్యోగంలోకి తీసుకునే క్రమంలో ఆయా కంపెనీలు నిబంధనలను అతిక్రమించడం, తప్పుడు వివరాలను సమర్పించినట్లు ప్రాథమికంగా తేలడంతో సదరు కంపెనీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టామని అధికారులు తెలిపారు. ఈ కంపెనీలపై ఇప్పుడు విచారణ జరుపుతామని వివరించారు.

ఆ కంపెనీలివే...

1. ఏజెల్ టెక్నాలజీస్, న్యూజెర్సీ
2. అమికా టెక్నాలజీ, కెంట్, వాషింగ్టన్
3. క్లిన్నార్ ఎల్‌ఎల్సీ, షికాగో, ఇలినాయిస్
4. డెల్టా సెర్చ్ ల్యాబ్స్, కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్
5. ఫోస్కామ్ డిజిటల్, హూస్టన్, టెక్సాస్
6. జీ హెల్త్‌కేర్ ఎల్‌ఎల్సీ, శాన్ జోస్, కాలిఫోర్నియా
7. ఇన్కాన్ కార్పొరేషన్, సన్నీవేల్, కాలిఫోర్నియా
8. మాక్రో నెట్‌వర్క్స్, న్యూఆర్క్, కాలిఫోర్నియా
9. ఎండీ2 సిస్టమ్స్, వర్జీనియా
10. నిషె సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, హూస్టన్, టెక్సాస్
11. నార్తర్న్ కాలిఫోర్నియా యూనివర్సల్ ఎంటర్‌ప్రైజ్ కార్పొరేషన్, శాన్ జోస్, కాలిఫోర్నియా
12. ఎన్‌వైసీ హెల్త్‌కేర్ స్టాఫింగ్, న్యూయార్క్
13. రీడ్‌స్ట్రా డైరీ లిమిటెడ్, మెన్డాన్, మిషిగాన్
14. టెలవా నెట్‌వర్క్స్ శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా
15. టెక్వైర్ సొల్యూషన్స్, జెర్సీ సిటీ, న్యూజెర్సీ.

చాలా ఇచ్చాం

ఇంకా ఇస్తాం... ఇస్తూనే ఉంటాం!

- ఏపీకి నిధులపై లోక్‌సభలో జైట్లీ
- రాజధాని సృష్టికీ చర్యలు చేపట్టాం
- సమస్యలకు త్వరగానే పరిష్కారం
- రెండు రోజుల్లో తేలుస్తామని హామీ
- రాజ్యసభలోనూ ఎంపీల ఆందోళన
- అట్టుడికిన సభ.. రెండుసార్లు వాయిదా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్యాకేజీకి సంబంధించి చాలా సంస్థల ఏర్పాటుకు నిధులిచ్చామని అరుణ్ జైట్లీ లోక్‌సభలో చెప్పారు. రాష్ట్ర సమస్యలపై రెండు రోజుల్లో ఒక పరిష్కారం అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర బడ్జెట్‌పై గురువారం సభలో చర్చ సందర్భంగా ఏపీ ఎంపీల ఆందోళనపై ఆయన ఈ మేరకు స్పందించారు. ఇప్పటికే ఇచ్చిన నిధులతో పెద్ద సంఖ్యలో తగు వ్యవస్థలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు ప్రతి వ్యవస్థ ఏర్పాటుకూ నిధులిస్తూనే ఉన్నామని, ఇంకా ఇస్తూనే ఉంటామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని ఇప్పటికే నిధులు విడుదల చేశామని చెప్పుకొచ్చారు. అంతకుముందు ఏపీ ఎంపీల ఆందోళనతో సభ కొద్దిసేపు వాయిదాపడి తిరిగి సమావేశమైంది. అనంతరం బడ్జెట్‌తోపాటు ఇతరత్రా అంశాలపై ప్రతిపక్షాల ఆరోపణలకు, సభలో తీవ్ర నిరసనలు, గందరగోళం మధ్యనే మంత్రి సమాధానాలిచ్చారు. తొలుత రాఫేల్ విమానాల కొనుగోలు ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపణలను ఖండించారు. ఈ ఒప్పందం విలువెంతో బయటపెట్టాలన్న డిమాండ్‌ద్వారా దేశ భద్రతకు వారు తీవ్ర ముప్పు కలిగిస్తున్నారన్నది తన ప్రత్యారోపణగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ జోక్యం చేసుకుంటూ సభలో ఎవరూ ఆరోపణలను సృష్టించడం లేదన్నారు. ‘‘ప్రజాధన వ్యయంపై పార్లమెంటుకు వెల్లడించాల్సిన బాధ్యత మీపై ఉంది’’ అని జైట్లీనుద్దేశించి వ్యాఖ్యానించారు. దీంతో ఎన్డీఏ తరహాలోనే యూపీఏ కూడా పార్లమెంటుకు జవాబు దారీయేనని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఆరోపణను తోసిపుచ్చడంతోపాటు ఎన్డీఏపై అవినీతి ఆరోపణలు సృష్టించడం ఈ మధ్యకాలంలో కొత్త ధోరణిగా మారిందని ఎద్దేవా చేశారు.

మీ హయాంలో ద్రవ్యోల్బణం మాటేంటి?

యూపీఏ పాలన కాలంలో ద్రవ్యోల్బణం 11 శాతంగా ఉందని జైట్లీ పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ విమర్శలను ఖండిస్తూ- ‘‘చివరకు తాజా బడ్జెట్‌లోనూ మధ్యతరగతి ప్రజానీకంపై నేనెంతో శ్రద్ధ చూపాను. నిజానికి ప్రతి బడ్జెట్‌లోనూ వారికి ఊరట కల్పిస్తూనే వచ్చాను. ఉద్యోగులకు కల్పించిన ప్రయోజనాల విలువ రూ.8 కోట్లుగా ఉంది’’ అని సమర్థించుకున్నారు. ఇక జీఎస్టీపై విమర్శలకు బదులిస్తూ... బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్నిటిమీదా జీఎస్టీ 18 శాతంగా ఉండాలని కాంగ్రెస్ వాదించిందని గుర్తుచేశారు. కానీ, వారు అధికారంలో ఉండగా 31 శాతం పన్నులు వసూలు చేసేవారని విమర్శిం చారు. సింగపూర్‌లో మెర్సిడెజ్ కారుకైనా, ఆహారానికైనా 7 శాతం వస్తుసేవల పన్ను విధిస్తారని పేర్కొన్నారు. తాను ఆ దేశానికి వెళ్లినపుడు ఇది గమనించానని, భారతదేశంలో అలా చేయడం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. జనాభాలో అధికశాతం దారిద్ర్య రేఖ దిగువ ఉన్నవారే ఉన్న మన దేశంలో విలాస వస్తువుల తోపాటు నిత్యావసరాలపై ఒకేవిధమైన పన్ను విధించడం ఎలా సాధ్యం కాగలదని నిలదీశారు. జీఎస్టీతో ప్రయోజనాలేమిటో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకూ తెలుసునని చెప్పారు. జీఎస్టీ సానుకూల ప్రభావంపై అంతర్జాతీయంగానూ గుర్తింపు లభించిందని, ఈ వ్యవస్థను ప్రవేశపెట్టాక కొన్ని నెలల వ్యవధిలోనే నిలకడ సాధించామని పేర్కొన్నారు.

వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ

ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని మంత్రి చెప్పారు. యూపీఏ పాలనలో భారత్‌ను ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎవరూ పేర్కొనలేదని, అది ఇప్పుడు మాత్రమే ప్రస్ఫుటం అవుతున్నదని పేర్కొన్నారు. వ్యవస్థాగత సంస్కరణలతో బాలరిష్టాలు సహజమేనని, దీర్ఘకాలికంగా అవెంతో ప్రయోజనకరమన్న వాస్తవం రుజువు కాగలదన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొన్న సమయంలో వాటి పరిష్కారానికి యూపీఏ ప్రభుత్వం ఏంచేసిందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ‘‘మంచి రోజులు ఎప్పుడొస్తాయ్?’’ అంటూ కాంగ్రెస్ సభ్యులు కేకలు వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వృద్ధి 6.3 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. నిరుడు ఇదే కాలంతో పోలిస్తే 7.2 శాతం మేర పెరిగిందని చెప్పారు. కాగా, జైట్లీ ప్రసంగం అనంతరం లోక్‌సభ ను స్పీకర్ సుమిత్రా మహాజన్ వాయిదావేశారు.

జైట్లీ జవాబివ్వాల్సిందే: సుజనా



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై రాష్ట్ర ఎంపీలు గట్టిగా ఆందోళనకు దిగడంతో రాజ్యసభ అట్టుడికింది. టీడీపీ ఎంపీలతోపాటు ప్రతిపక్ష సభ్యులు చర్చకు పట్టుబట్టడంతో చైర్మన్ వెంకయ్య తొలుత 12 గంటలదాకా, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలవరకూ వాయిదా వేశారు. ముందుగా టీడీపీ ఎంపీ, కేంద్రమంత్రి సుజనా చౌదరి ఏపీ విభజన చట్టం హామీల అమలు గురించి ప్రస్తావించారు. వీటిని కేంద్రం అమలు చేయనుందున బడ్జెట్‌పై చర్చలో ఆర్థికమంత్రి జైట్లీ జవాబివ్వాల్సిందేనని కోరారు. విభజన చట్టాన్ని ఆమోదించడంలో గందరగోళానికి కాంగ్రెస్, బీజేపీ రెండూ బాధ్యత వహించాల్సిందేనని చెప్పారు. ‘‘మీకందరికీ తెలిసిందే అయినా, రాష్ట్ర విభజనకు ఎంత దారుణరీతిలో ఆమోదం తెలిపిందీ కేంద్ర ప్రభుత్వం తరపున నేను మరోసారి గుర్తుచేస్తున్నాను. అత్యంత అశాస్త్రీయంగా, అడ్డగోలుగా విభజించినందుకు రెండు జాతీయ పార్టీలూ బాధ్యత వహించాల్సిందే. మూడున్నరేళ్లుగా మా ప్రభుత్వం ఈ చట్టంలోని కొన్ని వాగ్దానాలను అమలు చేయలేకపోయింది. ఈ సందర్భంగా ప్రత్యేక హోదాతోపాటు వనరుల లోటు భర్తీ, స్టీల్‌ప్లాంట్ నిర్మాణం తదితరాలపై సమస్యలేవైనా ఉన్నా... ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే ప్రస్తుత ప్రతిష్టంభనతో నిమిత్తం లేకుండా వాటిని పరిష్కరించాలని సూ చిస్తున్నా’’ అని స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీల మధ్య సహకారంపరంగా కాకుండా సహకారాత్మక సమాఖ్య తత్వం ప్రాతిపదికన మాట్లాడాలని కోరారు. ‘‘సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో అంగీకరిస్తూ ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో కట్టుబాటును ప్రకటించాలన్నది నా సూచన... అభ్యర్థన’’ అని వివరించారు. కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం మంత్రికి సమష్టి బాధ్యత ఉంటుందిగనుక కేబినెట్ నిర్ణయంతో ఏకీభవించని పక్షంలో ఆయన రాజీనామా చేయాలని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై టీడీపీ సభ్యులు మండిపడటంతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆయనను కూర్చోవాల్సిందిగా చైర్మన్ వెంకయ్య కోరినా- ‘‘మీరు ఏ చర్య తీసుకున్నా సిద్ధం’’ అంటూ మొండికేశారు. ఎంత చెప్పినా ఎవరూ వినకపోవడంతో మధ్యాహ్నం 2 గంటలదాకా వెంకయ్య సభను వాయిదావేశారు.

మరో కాల్‌సెంటర్ స్కాం

- ఈసారి కూడా పుణె కేంద్రంగానే 11 వేల మంది అమెరికన్లకు టోపీ
- భారీ మొత్తంలో డబ్బు వసూలు
- పన్ను అధికారులమంటూ బెదిరింపు



పుణె, ఫిబ్రవరి 8: సాఫ్ట్‌వేర్ కార్యకలాపాలకు కేంద్రంగా మంచి పేరున్న మహారాష్ట్రలోని పుణె నగరం రెండోకోణం ఘోరంగా ఉంది. పదే పదే ఇక్కడి కాల్‌సెంటర్ల బాగోతం బయటపడటంతో ఈ నగరం కేంద్రంగా సాగుతున్న అక్రమాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి. పన్ను ఎగవేసినందుకు మీకు శిక్షపడుతుందని అమెరికన్లను బెదిరించి, వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేస్తున్న మరో కాల్‌సెంటర్ గుట్టును పోలీసులు రట్టుచేశారు. కోరెగావ్ పార్క్‌ప్రాంతంలో ఉన్న కాల్‌సెంటర్‌పై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వాళ్లు దాదాపు 11 వేల మంది అమెరికా పౌరులను బెదిరించి, వారిలో ఒక్కొక్కరి నుంచి 500-1000 డాలర్ల చొప్పున వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఈ కాల్ సెంటర్ గుట్టును బయటపెట్టడంలో పుణె పోలీసులకు చెందిన ఆర్థిక, సైబర్ నేరాల విభాగానికి అమెరికాకు చెందిన ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్), ఫెడరల్‌ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) సాయం చేశాయి.

మోసం చేసేదిలా..

అమెరికాలో కొంతమంది ఏజెంట్లను పెట్టుకుని, అక్కడ ప్రధానంగా పన్ను ఎగవేత దారులు ఎవరెవరని గుర్తిస్తారు. వాళ్ల చిరునామాలు, ఫోన్ నెంబర్లు సంపాదించి, వారికి ఇక్కడి కాల్ సెంటర్ల నుంచి ఫోన్లు చేయించి తాము ఐఆర్ఎస్ అధికారులమని, పన్ను ఎగ్గొట్టినందుకు రెండు రోజుల్లో మీమీద దాడులు జరగబోతున్నాయని, అరెస్టు చేయడం ఖాయమని చెబుతారు. అలా అరెస్టు చేయకుండా ఉండాలంటే తమకు డబ్బులు ఇవ్వాలని ఆ తర్వాత బెదిరిస్తారు. అరెస్టు భయంతో ప్రతి ఒక్కరూ 500 నుంచి 1000 డాలర్ల చొప్పున వీరు చెప్పిన ఖాతాలలో జమ చేసేవారు. ఇలా భారీ మొత్తంలోనే ఈ కాల్ సెంటర్ ద్వారా సంపాదించినట్లు తెలుస్తోంది.

గతంలోనూ ఇక్కడే..

ఇంతకుముందు రెండేళ్ల క్రితం కూడా ఇలాగే పుణెలో ఉన్న ఒక కాల్ సెంటర్ యజమాని సాగర ఠక్కర్ అలియాస్ షాగీ కాల్‌సెంటర్ ద్వారా అమెరికన్లను పెద్ద మొత్తంలో మోసగించాడు. ఎట్టకేలకు అతడిని దుబాయ్‌లో అరెస్టుచేసి, భారతదేశానికి రప్పించారు. అతడు అప్పట్లో తాను అక్రమంగా సంపాదించిన సొమ్ముతో తన గర్ల్‌ఫ్రెండుకు ఆడి కారు కూడా కొని బహుమతిగా ఇవ్వడం సంచలనం రేపింది. ఇప్పుడు మరోసారి పుణె కేంద్రంగానే సాగుతున్న కాల్ సెంటర్ బాగోతం బయటపడటం విశేషం.

సచిన్ కుమార్తె పేరుతో నకిలీ ట్విటర్

- ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్టు



ముంబై, ఫిబ్రవరి 8: మాజీ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ కుమార్తె సారా టెండుల్కర్ పేరుతో నకిలీ ట్విటర్ ఖాతా తెరిచిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ముంబైలోని అంధేరీకి చెందిన నితిన్ సిశోడ్ (39)ను అరెస్టు చేయడంతో పాటు అతడి నుంచి లాప్‌టాప్, రెండు సెల్‌ఫోన్లు, వైఫై రూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ‘‘సారాసచిన్-ఆర్‌టీ’’ పేరుతో ట్విటర్ ఖాతా తెరచిన అతడు ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సహా పలువురు రాజకీయ నేతలపై అభ్యంతరకర పోస్టులు చేశాడు. ఈ ట్వీట్లు హల్‌చల్ చేయడంతో దీన్ని గుర్తించి సచిన్ పీఏ ముంబై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఐపీ అడ్రస్ ద్వారా నితిన్‌ను అరెస్టు చేశారు. అయితే తన వద్ద ఉన్న ల్యాప్‌టాప్ సెకండ్ హాండ్‌లో కొన్నానని, దానిని ముందు వాడిన వాళ్లు ఈ పని చేసి ఉండొచ్చని అతడి పేర్కొన్నారు.

అయోధ్య కేసు వాయిదా

- మార్చి 14న సుప్రీం విచారణ.. మరిన్ని ఫైళ్లు రావాలని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: అయోధ్య కేసు విచారణను సుప్రీం కోర్టు మరోసారి వాయిదా వేసింది. బాబ్రీ మసీదు-రామజన్మ భూమి వివాదాస్పద స్థల యాజమాన్య హక్కుకు సంబంధించి వాదప్రతివాదుల నుంచి మరిన్ని డాక్యుమెంట్లు అందాల్సి ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనికి సంబంధించి ఈ ఏడాది జూలై వరకు సమయం ఇస్తూ కేసు వాయిదా వేయాల్సిందిగా సున్నీ వక్ఫ్ బోర్డు, ఇతర మైనారిటీ వర్గ సభ్యులు కోరారు. అందుకు తిరస్కరించిన కోర్టు విచారణను మార్చి 14కు వాయిదా వేస్తున్నట్లు స్పష్టం చేసింది. కాగా, అయోధ్యలోని 2.77 ఎకరాల వివాదాస్పద స్థలాన్ని సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ మందిరాలకు సమానంగా విభజించి ఇవ్వాలని 2010లో అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం 2:1 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. అయితే దీనిపై సుప్రీం కోర్టులో పలు ప్రజా వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిని గత ఏడాది డిసెంబరులో సుప్రీం ధర్మాసనం విచారణకు స్వీకరించింది. నాడు కేసు విచారణను ఫిబ్రవరి 8న చేపట్టనున్నట్లు తెలిపింది. గురువారం మరోసారి విచారణను వచ్చే నెల 14కు వాయిదా వేసింది.

మా వాడిపై కేసు కొట్టేయండి

- సుప్రీంలో మేజర్ ఆదిత్య తండ్రి పిటిషన్
- అసలు నిందితులపై కేసు పెట్టాలని వినతి


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో సైన్యం కాల్పుల సంఘటనపై రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని మేజర్ ఆదిత్య తండ్రి లెఫ్టినెంట్ కల్నల్ కరమ్‌వీర్ సింగ్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు గురువారం ఆయన పిటిషన్ దాఖలు చేశారు. మేజర్ ఆదిత్య నేతృత్వంలోని ‘10 గఢ్వాల్ రైఫిల్స్ దళం’పై హత్య, హత్యాయత్నం ఆరోపణలతో నమోదైన కేసు చట్టబద్ధ విధులు నిర్వర్తించే సైనికుల మనోబలాన్ని దెబ్బతీస్తుందని కరమ్‌వీర్ పేర్కొన్నారు. వాస్తవానికి కాల్పులు చోటుచేసుకున్న రోజున ఆదిత్య అక్కడికి కొంత దూరంలో ఉన్నారని అధికారులకు స్పష్టం తెలిసినా అతనిపై కేసు పెట్టారన్నారు. తన కుమారుణ్ణి నిందితుడుగా నమోదు చేయడం ఏకపక్ష అధికార ప్రయోగమేనని తెలిపారు. ఆ రోజున సైనిక సిబ్బంది తమ విధుల్లో ఉండగా సుమారు 200 మంది ఆందోళనకారులు హింసాత్మక దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఫలితంగా వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. దాడి ఉధృతం కావడంతో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినా, నియంత్రిత పద్ధతిలోనే సిబ్బంది వ్యవహరించారని తెలిపారు.

‘మిత్ర దేశాల’కు ప్రత్యేక దూతలు

మాల్దీవ్స్ జాబితాలో చోటులేని భారత్

మాలె, ఫిబ్రవరి 8: మాల్దీవ్స్‌లో రాజకీయ సంక్షోభం ముదురుతున్న నేపథ్యంలో దేశంలో పరిస్థితిని వివరించడం కోసం ‘మిత్ర దేశాల’కు ప్రత్యేక దూతలను పంపుతున్నట్లు అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. అయితే, సదరు దేశాల జాబితాలో అత్యంత సమీపంలోగల భారత్ మినహా చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియాల పేర్లు మాత్రమే ఉండటం గమనార్హం. ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ నేతృత్వాన మాల్దీవ్స్‌లో ఇస్లామిక్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం సౌదీ, పాక్‌లకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది.

భూమికి సమీపంలో మరో గ్రహశకలం



వాషింగ్టన్, ఫిబ్రవరి 8: భూమి వైపుగా మరో గ్రహశకలం దూసుకువస్తోందని నాసా శాస్త్రవేత్తలు వెల్లడించారు. అయితే, దీనివల్ల భూగ్రహానికి వచ్చిన ముప్పేమిలేదని స్పష్టంచేశారు. ఈ నెల 9న (శుక్రవారం) సాయంత్రం వేళ భూమికి సమీపంలోనుంచి ఈ గ్రహశకలం దూసుకువెళుతుందన్నారు. ఈ నెల 4న ఇప్పటికే ఓ గ్రహశకలం భూమికి సమీపంలో నుంచి వెళ్లిందని, తాజా గ్రహశకలాన్ని కూడా అప్పుడే గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. 2018 సీబీగా వ్యవహరిస్తున్న ఈ గ్రహశకలం 15 నుంచి 30 మీటర్ల పొడవు ఉంటుందని వివరించారు. భారత కాలమానం ప్రకారం శనివారం(ఈ నెల 10న) తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో భూమి సమీపంలో నుంచి వెళ్లనుంది. ఆ సమయంలో భూమికి, గ్రహశ కలా నికి మధ్య కేవలం 64 వేల కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని చెబు తున్నారు. 2018 సీబీ ఆస్టరాయిడ్ సైజు చాలా తక్కువేనని వివరించారు.. అయితే నాలుగేళ్ల క్రితం రష్యాలోని చెల్యాబిన్స్‌లో పడిన ఉల్కకంటే పెద్దదని పేర్కొన్నారు. ఈ పరిమాణంలో ఉన్న గ్రహశకలాలు భూమికి సమీపం లోకి రావడం అరుదని నాసా పరిశోధకుడు పాల్ చోడాస్ తెలిపారు.

పోలీసుల నిర్లక్ష్యానికి యువకుడు బలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: విధి నిర్వహణలో పోలీసుల నిర్లక్ష్యం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఢిల్లీలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో బలమైన తీగ మెడకు తగలి ఓ మోటారు సైకిలిస్టు ప్రాణాలు కోల్పోయాడు. డిగ్రీ పూర్తి చేసి ఓ ప్రైవేటు ట్యాక్సీ సర్వీసులో పని చేస్తున్న 21ఏళ్ల యువకుడు మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్నాడు. నేతాజీ సుభాష్ ప్యాలెస్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు బారికేడ్లను కలుపుతూ ఓ తీగ కట్టి ఉంది. అసలే రాత్రి, ఆపై వీధి దీపాలు లేకపోవడంతో మోటార్‌సైకిల్‌పై వస్తున్న యువకుడు ఆ తీగను గుర్తించలేకపోయాడు. ఆ తీగ తగిలి యువకుడి మెడ కోసుకుపోవడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. ఈ ప్రమాదం జరిగిన 15 నిమిషాల ముందు మరో వ్యక్తి కూడా తీగ వల్ల ప్రమాదానికి గురయ్యాడు. అదృష్టవశాత్తు అతను ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, వారు బాధ్యతగా బారికేడ్లకు అమర్చిన తీగను తొలిగించి ఉంటే ఈ ఘటన జరిగేది కాదని, ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని యువకుడి తల్లిదండ్రులు కోరారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు ఘటనకు బాధ్యులుగా చేస్తూ నలుగురు కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తన సెంచరీల ఖాతాలో మరొకటి వేసుకున్నాడు. బుధవారం సౌతాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో 159 బంతుల్లో 160 పరుగులు చేశాడు. దీంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా 124 పరుగులతో గెలిచి ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో 3-0 ఆధిక్యంతో నిలిచింది. కోహ్లీ చేసిన ఈ భారీ స్కోరులో 12 ఫోర్లు 2 సిక్సర్లు ఉన్నాయి. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో కోహ్లీ మరికొన్ని రికార్డులు నమోదు చేశాడు. అవేంటో ఓసారి చూద్దాం...





రికార్డుల కింగ్ కోహ్లీ

అసాధారణ ప్రతిభావంతులు

మణికట్టు స్పిన్నర్లపై కెప్టెన్ కోహ్లీ ప్రశంసలు



కేప్‌టౌన్: భారత మణికట్టు స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్ మరోసారి టీమిండియాకు భారీ తేడాతో విజయాన్ని కట్టబెట్టారు. సౌతాఫ్రికాతో బుధవారమిక్కడ జరిగిన మూడో వన్డేలో వీరిద్దరు చెరి నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ కొట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ వన్డే సిరీస్‌లో మణికట్టు స్పిన్నర్లు అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నారని కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసలతో ముంచెత్తాడు. చాహల్, యాదవ్ కలిసి మూడు వన్డేల్లో 21 వికెట్లు తీశారు. వరుసగా తమను బాధపెడుతున్న ఈ మణికట్టు స్పిన్నర్లను ఎదుర్కోవడమెలాగో ఇప్పటికీ ప్రొటీస్‌కు అర్థం కావడం లేదు. టెస్టు ఫార్మాట్ విషయానికొస్తే.. కుల్‌దీప్ యాదవ్ గతేడాది ఆస్ట్రేలియాపై అరంగేట్రం చేశాడు. ఒకట్రెండు మ్యాచ్‌లు కూడా ఆడాడు. కానీ చాహల్ టెస్టుల్లో అరంగేట్రం చేయలేదు. 'వీళ్ల వికెట్లు తీస్తారని తెలుసు. ఎందుకంటే భారత్‌లోని ఫ్లాట్ పిచ్‌లపై కూడా వీళ్లు వికెట్లు పడగొట్టారు. టీ20 క్రికెట్‌లో చాలా తక్కువ సమయం ఉంటుంది కాబట్టి బ్యాట్స్‌మెన్ తొందర పడటం వల్ల వీళ్లకు తప్పక వికెట్లు పడతాయని కొంత మంది అనుకుంటున్నారు. ఆ రోజులు పోయాయి. ఇక్కడి వాతావరణంలో వికెట్లు తీస్తూ తమ బలమేంటో నిరూపించుకుంటున్నారు. ప్రత్యర్థి జట్టును తమ స్పిన్ మాయాజాలంతో పడగొట్టడం నిజంగా అద్భుతం. ఇది నమ్మశక్యం కానిది. ఎనిమిది వికెట్లు తీయడమనేది అసాధారణ ప్రతిభ' అని కోహ్లీ అన్నాడు. కొన్ని పరుగులు సమర్పించుకున్నప్పటికీ ఎంతో రిస్క్ చేసి వికెట్లు తీశారని కెప్టెన్ కొనియాడాడు. 'వీళ్ల ప్రతిభను గురించి చెప్పడానికి నా దగ్గర మాటల్లేవు. ఈ ఘనత వాళ్లదే. ప్రత్యర్థికి ఎలా బౌలింగ్ చేయాలి, ఫీల్డింగ్ ఎలా సెట్ చేసుకోవాలన్న విషయాల్లో వీళ్లు చాలా తెలివైన వాళ్లు. వీళ్లు ఎంత తెలివైన వాళ్లంటే ఫుల్ టాస్ బాల్స్ వేసి ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ బయటికి వచ్చి ఆడేలా చేస్తున్నారు. వాళ్ల ప్రతిభకు హ్యాట్సాఫ్. భవిష్యత్తులో ఏం జరుగుతుందో నాకు తెలీదు. కానీ ప్రస్తుతానికి నేను వాళ్ల ప్రతిభతో సంతోషంగా ఉన్నాను' అని కోహ్లీ చెప్పాడు. చాహల్, కుల్‌దీప్‌కు అనుకూలించిన అంశాలను చెప్పే ప్రయత్నం చేశాడు కోహ్లీ. ఇక్కడి పరిస్థితులు వాళ్లకు కరెక్ట్‌గా సరిపోయాయన్నాడు. 'పిచ్ కొద్దిగా సహకరించినా దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఫ్లాట్ పిచ్‌లపై వీరికి తిరుగుండదు. అద్భుతంగా రాణిస్తారు. వీళ్ల బౌలింగ్‌లో ఓవర్‌కు 6 పరుగులు చేయొచ్చుగాక. కానీ కనీసం 3 లేదా 4 వికెట్లు తీస్తారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అసాధారణ ప్రతిభ కనబరిచారు. ఎక్కువ వికెట్లు వీరిద్దరికే పడ్డాయి' అని కెప్టెన్ చెప్పాడు. కోహ్లీ మరో విషయం కూడా చెప్పాడు. రన్స్ ఎన్ని ఇచ్చామన్న దాని గురించి ఆలోచించకుండా వికెట్లపైనే దృష్టి పెట్టమని ఈ మణికట్టు స్పిన్నర్లకు తాను చెప్పినట్టు తెలిపాడు. 'ఎటువంటి సమయంలోనైనా వికెట్ల కోసమే బౌలింగ్ చేయమని చెప్పాను. వికెట్ల కోసం బౌలింగ్ చేసేటప్పుడు ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ అసౌకర్యంగా ఫీలవ్వాలి. డిఫెన్స్ ఆడేందుకు కూడా అవకాశం ఇవ్వొద్దు. చెప్పినట్టుగానే లైన్ అండ్ లెంగ్త్ పాటిస్తూ బౌలింగ్ చేసిన ఆ ఇద్దరికే ఈ ఘనత చెందుతుంది' అని కోహ్లీ వివరించాడు. అంతేకాకుండా వచ్చే ఏడాది జరగనున్న వరల్డ్ కప్‌లో ఈ మణికట్టు స్పిన్నర్లు కీలకపాత్ర పోషిస్తారని కెప్టెన్ చెప్పాడు.

12 భారత కెప్టెన్లలో అత్యధిక వన్డే సెంచరీలు (12) చేసిన కెప్టెన్‌గా కోహ్లీ నిలిచాడు. గతంలో సౌరవ్ గంగూలీ 11 సెంచరీలు చేశాడు.

34 భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో పోలిస్తే కోహ్లీ 205వ మ్యాచ్‌లోనే 34వ వన్డే సెంచరీ సాధించాడు. సచిన్ 298వ ఇన్నింగ్స్‌లో 34వ సెంచరీ చేశారు.

100 కోహ్లీ 100వ వన్డే సిక్సర్ కొట్టాడు. భారత క్రికెటర్లలో ధోనీ (216), రోహిత్ శర్మ (165) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు.

సౌతాఫ్రికా గడ్డపై భారత క్రికెటర్లలో కోహ్లీదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. గతంలో అంటే 2003 వరల్డ్ కప్‌లో పీటర్‌మారిట్జ్ బర్గ్‌లో నమీబియాపై టెండూల్కర్ 152 పరుగులు చేశారు.

2 వన్డేల్లో సెంచరీలు చేసిన టాప్-10 క్రికెటర్లలో కోహ్లీ 2వ స్థానంలో ఉన్నాడు. దిల్షాన్, గంగూలీ, క్రిస్ గేల్ కంటే 12 సెంచరీలు, కుమార సంగక్కర, ఏబీ డివిలియర్స్ కంటే 9 సెంచరీలు, హాషీం ఆమ్లా కంటే 8 సెంచరీలు, సనత్ జయసూర్య కంటే 6 సెంచరీలు, రికీ పాంటింగ్ కంటే 4 సెంచరీలు ముందున్నాడు. అయితే సచిన్ టెండూల్కర్ కంటే 15 సెంచరీలు వెనకబడివున్నాడు.

100 పిచ్‌పై పరుగులు తీస్తూ 100కు పైగా రన్స్ సాధించిన భారత తొలి క్రికెటర్‌గా కోహ్లీ ఘనత సాధించాడు. వన్డే క్రికెట్ చరిత్రలో ఐదో స్థానంలో ఉన్నాడు.


318 ఈ వన్డే సిరీస్‌లో కోహ్లీ ఇప్పటి వరకు 318 పరుగులు సాధించాడు. సౌతాఫ్రికా గడ్డపై ప్రొటీస్‌తో జరిగిన వన్డే ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన పర్యాటక బ్యాట్స్‌మన్‌గా కూడా కోహ్లీ రికార్డుల్లోకెక్కాడు.

160 కోహ్లీ 160 పరుగులతో నాటౌట్‌గా నిలవడం సౌతాఫ్రికా గడ్డపై ప్రొటీస్‌పై భారత బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే. గతంలో అంటే 2001లో జొహన్నెస్‌బర్గ్‌లో సౌరవ్ గంగూలీ 127 పరుగులు చేశారు.



400 వికెట్ల క్లబ్‌లో ధోనీ

టీమిండియా మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనీ తన ఘనమైన కెరీర్‌లో మరో కలికితురాయిని చేర్చుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 400 మందిని అవుట్ చేసిన నాలుగో వికెట్ కీపర్‌గా నిలిచాడు. సౌతాఫ్రికాతో ఇక్కడ జరిగిన మూడో వన్డేల్లో మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో ప్రొటీస్ తాత్కాలిక కెప్టెన్ మార్‌క్రమ్‌ను స్టంపింగ్ చేయడం ద్వారా ధోనీ ఈ ఘనత సాధించాడు. వికెట్ కీపర్‌గా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను అవుట్ చేసిన వారిలో శ్రీలంకకు చెందిన కుమార్ సంగక్కర (482), ఆస్ట్రేలియాకు చెందిన ఆడమ్ గిల్‌క్రిస్ట్ (472), సౌతాఫ్రికాకు చెందిన మార్క్ బౌచర్ (424) తొలి మూడు స్థానంలో ఉన్నారు. అయితే 315 మ్యాచ్‌ల్లో ధోనీ ఈ ఘనత సాధించాడు. మార్‌క్రమ్‌ను స్టంపింగ్ చేయడం వల్ల ధోనీ 294 క్యాచ్‌లు, 106 స్టంపింగ్స్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో తర్వాత డేవిడ్ మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌ను ధోనీ అందుకున్నాడు. నిజం చెప్పాలంటే స్టంపింగ్స్‌లో సంగక్కర 99తో రెండో స్థానంలో ఉన్నాడు.



కోహ్లీ జీనియస్

పాక్ దిగ్గజం జావెద్ మియాందాద్

కరాచీ: విరాట్ కోహ్లీ వన్డే సేనను పాకిస్థాన్ మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ కొనియాడారు. 'భారత బ్యాట్స్‌మెన్ ఎందుకు ఇంతగా విజయవంతమవుతున్నారని నేను గమనించాను. వాళ్లు సరైన బ్యాటింగ్ టెక్నిక్‌తో ఆడుతున్నారు. అంతేకాకుండా కోహ్లీ అనుసరిస్తున్న బ్యాటింగ్ విధానం వల్లే అతను ఒక్కసారి కాదు ఎన్నిసార్లు బ్యాటింగ్‌కు దిగినా పరుగులు చేస్తూనే ఉన్నాడు. టెక్నిక్ బాగోలేనప్పుడు ఏ బ్యాట్స్‌మన్ అయినా ఎప్పుడో ఒకసారి పరుగులు చేయగలడు తప్ప వరుసగా రాణించలేడు. కోహ్లీ విషయంలో ఇది నిజమని తెలుస్తోంది' అని మియాందాద్ చెప్పారు. సౌతాఫ్రికా పర్యటనలో ప్రొటీస్‌పై కోహ్లీ సవారీ చేస్తున్నాడు. ఇప్పటి వరకు ఆడిన మూడు వన్డేల్లో కోహ్లీ సేన గెలిచింది. ఇందులో కోహ్లీ రెండు సెంచరీలు నమోదు చేశాడు. కేప్‌టౌన్‌లో జరిగిన మూడో వన్డేల్లో రెండో ఓవర్లోనే బరిలోకి దిగిన కోహ్లీ 159 బంతుల్లో 160 పరుగులు సాధించాడు. 'కోహ్లీ వంటి గొప్ప బ్యాట్స్‌మన్ ప్రత్యర్థి బౌలర్ల బలాలు, బలహీనతలను వెంటనే అంచనా వేసుకుని తదనుగుణంగా బ్యాటింగ్ టెక్నిక్‌ను ఉపయోగిస్తున్నాడు. కోహ్లీ జీనియస్. ప్రపంచంలోనే ఉత్తమ బ్యాట్స్‌మన్' అని పాక్ దిగ్గజం అన్నారు.

సింధు గెలిచినా... జపాన్ చేతిలో భారత్ ఓటమి

- క్వార్టర్ ఫైనల్ ఆశలు సజీవం
- ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్

అలోర్ సెటర్: ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ టోర్నీలో పీవీ సింధు గెలిచినా భారత జట్టు 1-4తో జపాన్ చేతిలో ఓటమిపాలైంది. అయినప్పటికీ భారత్ క్వార్టర్ ఫైనల్ ఆశలు సజీవంగా ఉన్నాయి. ఈ టోర్నీలో సింధు తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. గురువారం జరిగిన ఈ పోరులో సింధు ప్రపంచ 2వ ర్యాంక్ షట్లర్ అకానె యమగుచిపై వరుస సెట్లలో గెలిచింది. జపాన్ చేతిలో ఓటమిపాలైనప్పటికీ ఈ టోర్నీలో భారత పురుషులు, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. గ్రూప్-డబ్ల్యూలో భారత మహిళల జట్టు ఒక గెలుపు, ఒక విజయంతో రెండో స్థానంలో ఉండగా.. జపాన్ అగ్రస్థానంలో నిలిచింది. హాంకాంగ్ చైనా జట్టు చివరి స్థానంతో సరిపెట్టుకుంది. తొలి పోరులో సింధు నేతృత్వంలోని భారత జట్టు 3-2తో హాంకాంగ్ చైనాను ఓడించిన సంగతి తెలిసిందే. గ్రూప్-డిలో భారత పురుషుల జట్టు 5-0తో తక్కువ ర్యాంక్ జట్లు ఫిలిప్పీన్స్, మాల్దీవులపై గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. చివరి పోరులో బలమైన ఇండోనేషియా జట్టుతో పురుషుల జట్టు తలపడనుంది. ఇక మహిళల జట్టు విషయానికొస్తే.. తొలి మ్యాచ్‌లో ఒలింపిక్ రజత పతక విజేత సింధు 21-19, 21-15తో యమగుచిపై గెలిచి భారత్‌కు తొలి ఆధిక్యం అందించింది. గెలుపుతో యమగుచిపై సింధు 5-3 ముఖా ముఖీ రికార్డును సాధించింది. అయితే తర్వాత జరిగిన పోరుల్లో సహచరుల నుంచి సింధుకు అంతగా మద్దతు లభించలేదు. మరో మహిళల సింగిల్స్‌లో శ్రీకృష్ణ ప్రియ కుడారవల్లి 12-21, 10-21తో జపాన్‌కు చెందిన సయక సటొ చేతిలో ఓటమిపాలైంది. తర్వాత జరిగిన మరో మహిళల సింగిల్స్‌లో అశ్వినీ పొన్నప్పపై 14-21, 12-21తో ప్రపంచ 16వ ర్యాంక్ షట్లర్ అయ ఒహొరి నెగ్గింది. దీంతో జపాన్ 2-1 ఆధిక్యంతో నిలిచింది. అయితే తర్వాత జరిగిన మహిళల డబుల్స్‌లో సంయోగిత ఘోర్పడే, ప్రజక్తా సావంత్ జోడీ కూడా 17-21, 17-21తో షిహొ టనక, కొహరు యొనెమొటొ చేతిలో ఓడిపోవడంతో జపాన్ 3-1తో తిరుగులేని ఆధిక్యంతో నిలిచింది. తర్వాత జరిగిన మరో డబుల్స్‌లోనూ ఇదే పునరావృతం అయింది. పొన్నప్ప, ఎన్. సిక్కిరెడ్డి జోడీపై 18-21, 18-21తో మిసకి మసుటొమొ, అయక టకహషి ద్వయం గెలవడంతో భారత్ ఓటమి పరిపూర్ణమైంది.

గేమ్స్ విలేజి చేరుకున్న భారత బృందం

- నేటి నుంచి వింటర్ ఒలింపిక్స్



పియాంగ్‌చాంగ్: భారత అథ్లెట్ల బృందం పియాంగ్‌చాంగ్‌లోని గేమ్స్ విలేజ్‌కు గురువారం చేరుకుంది. దీంతో గేమ్స్ విలేజిలో త్రివర్ణ పతకాం రెపరెపలాడింది. వింటర్ ఒలింపిక్ గేమ్స్ శుక్రవారమిక్కడ ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో లూగర్ శివ కేశవన్, భారత బృందం చెఫ్ డి మిషన్ హర్జిందర్ సింగ్, గేమ్స్ విలేజి మేయర్ పాల్గొన్నారు. 'గేమ్స్ విలేజి మేయర్ భారత బృందానికి సాదర స్వాగతం పలికారు. వెల్‌కం సెరిమనీలో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వంగా ఉంది. నిర్వాహకులు మమ్మల్ని బాగా చూసుకుంటున్నారు. మైనస్ 20 డిగ్రీల చలి సమస్య తప్ప మరే ఇబ్బందీ లేదు' అని హర్జిందర్ అన్నాడు. క్రాస్ కంట్రీ స్కీయర్ జగదీష్ సింగ్ శుక్రవారం ఇక్కడికి చేరుకునే అవకాశముంది. పురుషుల లూగ్ సింగిల్స్ ఈవెంట్స్ 10, 11 తేదీల్లో జరగనున్నాయి.

సకినా ఖాతూన్‌ను తీసుకోండి

సీజీఎఫ్‌కు ఐఓఏ లేఖ



న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనాలన్న పారా పవర్-లిఫ్టర్ సకినా ఖాతూన్ కల నిజం కానుంది. కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే భారత జట్టులో తన పేరు లేకుండా ఇండియన్ ఒలింపిక్స్ అసోసియేషన్ (ఐఓఏ) కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకుంటానన్న ఖాతూన్ బెదిరింపులకు ఐఓఏ భయపడిందో ఏమో కానీ భారత జట్టులో సకినా ఖాతూన్‌ను పేరు చేర్చాలని కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ (సీజీఎఫ్)కు ఐఓఏ లేఖ రాసింది. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో ఖాతూన్ మహిళల లైట్‌వెయిట్ (61 కిలో) కేటగిరిలో కాంస్య పతకాన్ని గెలిచింది. ఈ సమస్యను పరిష్కరించమని.. కామన్వెల్త్ గేమ్స్‌లో ఖాతూన్ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఐఓఏ ఆ లేఖలో పేర్కొంది. సీజీఎఫ్ నిబంధనల ప్రకారం సకినా ఖాతూన్ గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించిందని సీజీఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారికి రాసిన లేఖలో ఐఓఏ కార్యదర్శి రాజీవ్ మెహతా పేర్కొన్నారు.

కోచ్‌లు తల్లిదండ్రులతో సమానం

- క్రికెట్ దిగ్గజం సచిన్



ముంబై: కోచ్ రమాకాంత్ అచ్రేకర్ తనకు అందించిన సహాయ సహకారాలను గుర్తు చేసుకున్న భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్.. కోచ్‌లు, గురువులు తల్లిదండ్రులతో సమానమని అన్నారు. 'కోచ్‌లు, గురువులు మనకు తల్లిదండ్రుల వంటి వారు. ఎందుకంటే వారి వద్ద ఎన్నో విషయాలను తెలుసుకుంటాం.. నేర్చుకుంటాం. వారితో ఎక్కువ సేపు వారితో గడుపుతాం' అని ఓ పుస్తకం విడుదల సందర్భంగా సచిన్ అన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రుల బాధ్యతపై 'ఈవెన్ వెన్ దెర్ ఈజ్ ఎ డాక్టర్' అనే పుస్తకాన్ని మాస్టర్ బ్లాసర్ గురువారం విడుదల చేశారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ యశ్వంత్ అంబేద్కర్, డాక్టర్ రాజేష్ చౌహాన్, కృష్ణన్ శివరామకృష్ణన్ కలిసి రాశారు. 'ఆ సమయంలో అచ్రేకర్ సర్ చాలా కఠినంగా వ్యవహరించారు. అంతేకాదు ఆయన నన్ను ఎంతో ప్రేమించేవారు. ఆయన నాకు సంరక్షణగా నిలిచేవారు. నువ్వు బాగా ఆడావ్ అని సర్ నాతో ఎన్నడూ అనలేదు. కానీ ఆయన నాకు భేల్-పురి, పానీ-పురి తినిపించినప్పుడు సర్ నా ఆటతీరుపై చాలా సంతోషంగా ఉన్నారని నాకు తెలిసేది. చిన్నప్పుడు నేను చాలా అల్లడి చేసేవాడిని. నన్ను కట్టడి చేయడం చాలా కష్టం. కానీ సమతుల్యమైన కుటుంబం నాకు దొరకడం నా అదృష్టం. నా తల్లి దండ్రులు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. ఎప్పుడూ కోపపడరు. వాళ్లు నాకు చాలా స్వేచ్ఛనిచ్చారు. కానీ వాళ్లు నన్ను చెడిపోనివ్వ లేదు' అని సచిన్ వివరించారు.

బాలికల ఆర్చరీలో ఏపీకి స్వర్ణం

- హాకీలో ఒడిషా, హరియాణాలకు పసిడి పతకాలు
- ముగిసిన ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్

న్యూఢిల్లీ: ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌లో భాగంగా గురువారం చివరి రోజు ఆర్చరీలోని నాలుగు స్వర్ణ పతకాలను ఆంధ్రప్రదేశ్‌తో పాటు హరియాణా, మహారాష్ట్ర, పంజాబ్ జట్లు పంచుకున్నాయి. బాలబాలికల హాకీలో ఒడిషా, హరియాణా జట్లు పసిడి పతకాలను గెలుచుకున్నాయి. గురువారం ఉదయం జరిగిన బాలికల మ్యాచ్‌లో హరియాణా 2-1తో జార్ఖండ్‌ను చిత్తు చేసింది. బాలికల విభాగంలో పంజాబ్ జట్టు 5-4తో చండీఘర్‌పై గెలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. తర్వాత బాలుర విభాగంలో జరిగిన మ్యాచ్‌లో ఒడిషా 3-0తో పంజాబ్‌పై నెగ్గింది. అయితే చండీఘర్ 5-1తో ఉత్తరప్రదేశ్‌ను ఓడించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ అనాస్, జిమ్నాస్టిక్స్‌లో జమ్మూ-కాశ్మీర్‌కు చెందిన బబ్లీన్ కౌర్ సత్తా చాటారు. జూడోలోనూ హరియాణా చివరి రోజు రెండు స్వర్ణ పతకాలను గెలుచుకుంది. మొత్తం 12 (5 స్వర్ణ, 1 రజత, 6 కాంస్య) పతకాలతో చివరి రోజు హరియాణా ఆధిపత్యం ప్రదర్శించింది. ఓవరాల్‌గా హరియాణా 16 పసిడి పతకాలను కైవసం చేసుకోగా.. పంజాబ్‌కు మూడు దక్కాయి. మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, మణిపూర్ రెండేసి పతకాలను సొంతం చేసుకున్నాయి. బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పంజాబ్, కేరళ జట్లు స్వర్ణం గెలిచాయి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com